# గొప్ప ప్రేమ

## హోషేయ గ్రంథం - సంగ్రహ సమీక్ష

### I. ఉపోద్ఘాతం :

హోషేయ గ్రంథం చిన్న ప్రవక్తల గ్రంథాలలో మొదటిది. బైబిలులో ప్రవచన గ్రంథాలు 2 భాగాలుగా విభజించబడ్డాయి. యెషయా మొదలుకొని దానియేలు వరకు గల ఐదు గ్రంథాలు పెద్ద ప్రవక్తల గ్రంథాలని, హోషేయ నుండి మలాకీ గ్రంథం వరకు 12 గ్రంథాలను చిన్న ప్రవక్తల గ్రంథాలని పిలుస్తారు. గ్రంథం యొక్క పరిమాణమును బట్టి అలా పిలువబడ్డాయి గాని ప్రవక్తలలో పెద్దవారని, చిన్నవారని తేడా లేదు. చిన్న ప్రవక్తల గ్రంథాలు అపొక్రిపాలో కూడా 12 గ్రంథాలు అని పేర్కొనబడ్డాయి. చిన్న ప్రవక్తల గ్రంథాలను వ్రాసిన ప్రవక్తలు సయితం పెద్ద ప్రవక్తల వలెనే, దేవుని ప్రజలు దేవుని ఆజ్ఞలను మీరడాన్ని ఖండించారు, అన్య రాజ్యాలతో సంధిని నిరసించారు; దేశభక్తిగలవారుగా రాజకీయ, నైతిక అవినీతిని ఖండించి, దేవునికి దూరం కావద్దని ప్రజలను హెచ్చరించారు.

**1. గ్రంథకర్త :** బేయేరి కుమారుడైన హోషేయ ఈ గ్రంథాన్ని వ్రాసి ఉండవచ్చునన్న అభిప్రాయం ఉన్నది. ఇతడు ఉత్తర ఇశ్రాయేలు రాజ్యానికి ప్రవక్తగ నియమింపబడి, యెహోయాషు కుమారుడైన యరొబాము అనే రాజు దినాలలో ప్రవచించాడు. దక్షిణ రాజ్యంలోని యూదా ప్రజల పాపాల కోసం యిర్మీయా ప్రలాపించినట్లు, ఉత్తర ప్రవక్తల కంటె ఎక్కువ కాలం పరిచర్య చేసాడు. పెద్ద ప్రవక్తలైనా చిన్న ప్రవక్తలైనా, ఇశ్రాయేలు దేశం, విభాగించబడ్డాకనే ప్రవచించారు. రాజులు పరిపాలనలో ఓడిపోయినప్పుడు, ఆత్మీయంగా పడిపోయినప్పుడు దేవుడు ప్రవక్తలను లేవనెత్తాడు.

హోషేయ యిర్మీయా కంటె ముందు ప్రవచించాడు. హోషేయ, ఆమోసు ఉత్తర రాజ్యంలోను; యెషయా, మీకా దక్షిణ రాజ్యంలోను ఒకే కాలంలో (క్రీ.పూ. 8వ శతాబ్దంలో) ప్రవచించారు.

**2. గ్రంథ రచన కాలం :** హోషేయ ప్రవచించిన కాలము, దక్షిణ రాజ్యంలోని యూదా రాజుల పరిపాలన కాలమును బట్టి తెలియజేయబడింది. గనుక ఈ గ్రంథం బహుశా యూదయ ప్రాంతంలోనే వ్రాయబడి ఉండవచ్చును. అతడు ఉజ్జియా, యోతాము, ఆహాజు, హిజ్కియా అనే రాజుల దినములలో ప్రవచించాడు (1:1). ఈ గ్రంథము ఉత్తర రాజ్యపు రాజధానియైన షోమ్రోను (సమరయ) నాశనం చేయబడిన తరువాత అనగా క్రీ.పూ. 722-721 సంవత్సరాలలో వ్రాయబడి ఉండవచ్చును. హోషేయ దీనిని స్వయంగా వ్రాసాడో లేదో తెలియదు గాని, ఈ ప్రవచనాలన్నీ హోషేయనే చెప్పాడు గనుక ఈ గ్రంథానికి అతని పేరు పెట్టబడింది.

3. **గ్రంథంలోని ముఖ్యాంశం :** ఇశ్రాయేలు ప్రజలు సజీవుడైన నిజదేవుణ్ణి విసర్జించి, భయంకరమైన మతభ్రష్టత్వంలో పడిపోయారు. ఫలితంగా ప్రజల వ్యక్తిగత, సామాజిక జీవితాలు దుర్మార్గ పూరితమయ్యాయి. వారి ప్రవర్తన దేవునికి బాధ కలిగించినా ఆయన వారిని ప్రేమించడం మానలేదని, వారు పశ్చాత్తాపపడి దేవుని వైపు తిరగాలని హోషేయ వివరించాడు.

4. **గ్రంథ విశిష్టత :** హోషేయ గ్రంథం బైబిలులోనే ఓ వింతైన పుస్తకం. అందుకు కారణం హోషేయకు గోమెరుకు గల సంబంధం. ఈ గ్రంథంలో ఉత్తర రాజ్యం ఎఫ్రాయీము అని సంబోధించబడడం గమనార్హం. 12 గోత్రాలలో ఆత్మీయంగా మొదట పడిపోయిన గోత్రం ఎఫ్రాయిము. పాత నిబంధనలోని ఇతర గ్రంథాలలోని మాటలకన్న హోషేయ గ్రంథంలోని మాటలు క్రొత్త నిబంధనలో ఎక్కువగా (సుమారు 30 సార్లు) ప్రస్తావించబడ్డాయి.

   **ఉదాహరణకు :** ఈ క్రింది వచనాలను గమనించండి.

   హోషేయ 11:1 – మత్తయి 2:15లో　　హోషేయ 6:6 – మత్తయి 9:13లో
   హోషేయ 10:8 – లూకా 23:30లో　　హోషేయ 2:23 – రోమా 9:25లో
   హోషేయ 13:14 – **I** కొరింథి 15:55లో

   హోషేయ ఉత్తర రాజ్యంలో ప్రవచించినప్పటికినీ, దక్షిణ రాజ్యమైన యూదాను గూర్చి పలుమార్లు పేర్కొన్నాడు. (హోషే 1:7,11; 4:15; 5:5,10,13; 6:4,11; 10:11; 11:12; 12:2). ఈ గ్రంథంలో ఆత్మీయ భ్రష్టత్వం ఆత్మీయ వ్యభిచారముగా పరిగణించబడింది.

5. **చారిత్రాత్మక నేపథ్యం :** చాల సంవత్సరాల ఉచ్ఛస్థితి తరువాత **II** యరొబాము మరణంతో ఉత్తర రాజ్యం యొక్క క్షీణదశ ప్రారంభమైంది. దుస్థితిలో ఉన్న ఉత్తర రాజ్యం యొక్క అంతిమ దశలో 6గురు రాజుల పరిపాలనలో హోషేయ జీవించాడు. అందులో నలుగురు రాజులు (జెకర్యా, షల్లూము, పెకహ్యా మరియు పెకహు) అధికారంలో ఉండగానే వారి వారసుల ద్వారా చంపబడ్డారు. హోషేయ అనే రాజు యుద్ధంలో పట్టబడ్డాడు. ఒక్క మెనహేము మాత్రమే సాధారణ మరణాన్ని పొందాడు. తరువాత అతని కుమారుడు పెకహ్యా రాజు అయ్యాడు. మెనహేము అష్షూరీయులకు పన్నుకట్టుతూ వచ్చాడు (**II** రాజు 15:19, 20). అయితే అతని కుమారుడైన పెకహ్యా క్రీ.పూ. 730లో పెకహు ద్వారా చంపబడిన తరువాత ఇశ్రాయేలు రాజ్యం అష్షూరీయులచే విభజించబడింది. ఇశ్రాయేలు రాజుకు, ఎఫ్రాయిము గోత్ర ప్రాంతం మరియు మనష్షేగోత్ర ప్రాంతంలో పశ్చిమ భాగం మాత్రమే మిగిలాయి. పెకహ్యా తరువాత రాజైన హోషేయ అపనమ్మకత్వాన్ని బట్టి సమరయ పట్టబడింది. అందలి ప్రజలు క్రీ.పూ. 722-721లో చెరకు తీసుకొనిపోబడ్డారు (హోషేయ 7:8,9). అలా ఉత్తర రాజ్యం అంతమొందించబడింది. ఇశ్రాయేలీయులు, కనానీయుల జీవిత విధానాన్ని అలవర్చుకొన్నందు వల్లనే ఈ పరాభవం సంభవించినదని ప్రవక్త ఆరోపించాడు.

వారి జీవిత విధాన మంతటిలో బయలు ఆరాధన అలముకొన్నది. జాతి నాయకులే దానిని ప్రోత్సహించారు (హోషేయ 5:1) ఫలితంగా దేశంలో అన్యాయం, అరాచకం, దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, త్రాగుబోతుతనం, కుట్రలు మితిమీరాయి. (హోషేయ 6:7-7:7) ఇశ్రాయేలు ఎవరికైతే ప్రధానం చేయబడిందో ఆ యెహోవానే విసర్జించింది.

**6. వేదాంతపర సత్యాలు :**

అ) దేవునికి మరియు ఇశ్రాయేలుకు మధ్యనున్న నిబంధన సంబంధంపై హోషేయ తన దృష్టిని కేంద్రీకరించాడు. తన జీవిత అనుభవం ద్వారా ఇశ్రాయేలు పట్ల దేవుని ప్రేమను, దేవుని పట్ల ఇశ్రాయేలు వైఖరిని చక్కగా అర్థం చేసుకోగలిగాడు.

ఆ) ఇశ్రాయేలుకు సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను, సైనిక పరాజయాలను హోషేయ, దేవుని ప్రతీకారచర్యలుగా భావించాడు.

**II. హోషేయ వ్యక్తిగత జీవితం :** ఈ గ్రంథమంతా కూడ, హోషేయ వ్యక్తిగత జీవిత అనుభవం పై ఆధారపడి ఉన్నది. గనుక అతని జీవిత వివరాలు తెలిసికోవడం ఎంతైన అవసరం. "హోషేయ" అన్న పేరుకు "రక్షణ" అని అర్థం. దేవుడు వ్యభిచారిణి అయిన గోమెరును వివాహం చేసుకోమని హోషేయతో చెప్పాడు. "గోమెరు" అన్న పేరుకు "లోపరహితం" అని అర్థం. కాని గోమెరులో అన్నీ లోపాలే ఉన్నాయి. ఈ స్త్రీ, వివాహానికి పూర్వం నుండే అపనమ్మకస్తురాలని కొందరి అభిప్రాయం. అయితే మరికొంతమంది, ఈమె ప్రారంభంలో నమ్మకంగానే ఉండినది కాని తరువాత నమ్మక ద్రోహం చేసిందని చెప్తారు. గోమెరు, హోషేయకు ముగ్గురు పిల్లలను కనిన తరువాత అతనిని విడిచి వెళ్ళిపోయింది. చివరికి అందమంతా తరిగిపోయి వాడిపోయాక, అందరూ ఆమెను విడచివెళ్ళిపోయాక, హోషేయ మళ్ళీ ఆమెను తీసుకొనివచ్చాడు. ఈ వృత్తాంతమంతా స్పష్టంగా చెప్పబడలేదు. ఎందుకంటే ఈ గ్రంథం ముఖ్యోద్దేశం దేవుని ప్రేమను వివరించడమే. ఇశ్రాయేలుపట్ల సమసిపోని దేవుని ప్రేమను అర్థం చేసుకోడానికి హోషేయ వ్యక్తిగత జీవితం ఉపయోగపడింది. **దేవుడు గోమెరును వివాహం చేసికోమని చెప్పడానికి గల కారణాలు.**

**1. అనుభవాత్మక కారణం :** ఆత్మీయ జారత్వంలో ఉన్న ఉత్తర రాజ్యం (ఎఫ్రాయిము) పట్ల దేవునికి ఎంత వేదన ఉన్నదో హోషేయ అనుభవపూర్వకంగా తెలిసికొని ప్రవచించాలని దేవుని ఉద్దేశం. దేవుని ప్రేమను, క్షమాపణను, ఆయన దీర్ఘశాంతాన్ని మరియు క్రమశిక్షణను మనం అర్థం చేసుకోడానికి మన జీవితంలో కొన్ని పరిస్థితులు అనుమతించబడతాయి. మనకు ఇతరుల ద్వారా కలిగే వేదనను బట్టి, మన వలన దేవునికి కలిగే వేదనను అర్థం చేసుకొంటాం. మన జీవిత భాగస్వామి, లేక పిల్లల అవిధేయత వలన కలిగే బాధ ద్వారా, మనం దేవునికి అవిధేయత చూపించినపుడు ఆయన ఎంత బాధపడతాడో అర్థం చేసుకొంటాం.

2. **సాదృశ్యాత్మక కారణం :** ఇశ్రాయేలు జాతికి ఇవ్వబడిన సందేశానికి హోషేయ వైవాహిక జీవితం ఒక దృశ్యమైన సాదృశ్యంగా ఉన్నది. గనుక ఇశ్రాయేలు దేవుని సందేశాన్ని సులభంగా అర్థం చేసుకోగలుగుతుందని దేవుని కోరిక. ఈ లోకంలో మన జీవితం ద్వారా ఇతరులు, దేవునికి మనకు గల సంబంధాన్ని బట్టి దేవుణ్ణి తెలిసికొనేరీతిగా మనం సాదృశ్యంగా ఉండాలి.

3. **ప్రవచనాత్మక కారణం :** హోషేయకు పుట్టిన పిల్లలకు పెట్టబడిన పేర్లు, భవిష్యత్తులో ఇశ్రాయేలు పొందబోయే శిక్షను, మరియు సమకూర్పును ప్రవచనాత్మకంగా వివరిస్తున్నాయి (1:4,6,8,9). క్రైస్తవులుగా మనం పెట్టుకొనే పేర్లు ప్రభువును, ఆయన కార్యాలను లోకానికి వెల్లడించేవిగా ఉండాలి.

## III. హోషేయ గ్రంథ విభజన :

**1. వ్యక్తిగత జీవిత సందేశం - 1-3 అధ్యా (ప్రవక్త మరియు అపనమ్మకస్తురాలైన అతని భార్య)**

అ. హోషేయ వ్యభిచారిణి అయిన గోమెరును వివాహమాడుట 1 అధ్యా

ఆ. గోమెరు నమ్మక ద్రోహి అని నిరూపించుకొనుట 2 అధ్యా

ఇ. గోమెరును తిరిగి చేర్చుకొమ్మని హోషేయకు ఆదేశించబడుట 3 అధ్యా

**2. ప్రవచనాత్మక సందేశం - 4-14 అధ్యా (దేవుడు మరియు నమ్మక ద్రోహియైన ఇశ్రాయేలు జాతి)**

**అ. ఇశ్రాయేలు వ్యభిచారం చేయుట**

1. ఇశ్రాయేలు పాపం - ధర్మశాస్త్రాన్ని త్రోసిపుచ్చుట, అనైతిక జీవితం దేవుని వాక్యాన్ని విస్మరించుట మరియు విగ్రహారాధన. - 4 అధ్యా
2. ఇశ్రాయేలు దేవుని నుండి తొలగిపోవుట, ఘోరమైన స్థితికి దిగజారుట - 5 అధ్యా

**ఆ. అంత్యదినాల్లో ఎఫ్రాయిము తిరిగివస్తుంది గాని, ప్రస్తుత పాపాన్ని బట్టి ప్రస్తుతం తీర్పు పొందాలి. 6 అధ్యా**

**ఇ. తనను ప్రేమిస్తున్న దేవుని వైపు తిరగడం ద్వారా ఇశ్రాయేలు తీర్పును తప్పించుకోవచ్చును.**

1. ఇశ్రాయేలు పిరికి గువ్వలా ఐగుప్తు మరియు అష్షూరువైపు తిరిగింది. - 7 అధ్యా
2. బంగారు దూడ మరియు బలిపీఠాలవైపు తిరిగింది. 8 అధ్యా
3. మొండి పెయ్యలాగ దున్నడానికి ఇష్టపడలేదు గనుక తోలివేయబడుతుంది 9,10 అధ్యా
4. దేవుని నుండి తొలగిపోయి తీర్పుకు లోనైంది. కాని దేవుడు విడిచిపెట్టలేదు 11,12 అధ్యా

**ఈ. అంత్యదినాలలో ఇశ్రాయేలు విగ్రహాలను వదలి దేవుని వైపు తిరుగుతుంది.**

1. ప్రస్తుతం ఇశ్రాయేలుకు తీర్పు తీర్చబడుతుంది. 13 అధ్యా
2. భవిష్యత్తులో ఇశ్రాయేలు రక్షించబడుతుంది. 14 అధ్యా

## IV. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

**1. బాధపడుతున్న భర్త మరియు బాధకు కారణమైన భార్య (హోషేయా - గోమెరు) - 1-3 అధ్యా :** హోషేయ భార్య గోమెరు ఒక వ్యభిచారిణి పెళ్ళయ్యాక కూడ ఆమె తన వ్యభిచారాన్ని మానుకోలేదు. అతని కుటుంబ పరిస్థితులు అనేకులకు చర్చనీయాంశం అయి ఉండవచ్చును. కాని అలాంటి స్త్రీని వివాహం చేసుకోమని దేవుడే చెప్పాడు. అది ఆయన ఆజ్ఞ. దేవుడు ఒక ప్రవక్తతో వ్యభిచారిణిని పెళ్ళి చేసుకోమని చెప్తాడా? ధర్మ శాస్త్రము ప్రకారము యాజకుడు జార స్త్రీనిగాని, విడాకులు తీసుకొన్న స్త్రీనిగాని పెళ్ళిచేసుకోవద్దు (లేవీ 21:7). హోషెయా యాజకుడు కాడు. బహుశా హోషెయా పెళ్ళినాటికి గోమెరు వ్యభిచారిణి కాకపోవచ్చును. కాని పెళ్ళైన తరువాత భర్తకు నమ్మకద్రోహం చేసింది. క్రొత్త నిబంధన ప్రకారం, దేవుని యాజక సమూహములో చేర్చబడిన ప్రతి విశ్వాసికి కూడ ఇదే సూత్రం వర్తిస్తుంది. ముఖ్యంగా విశ్వాసి విశ్వాసినే వివాహం చేసుకోవాలి (**II** కొరి. 6:14-18). పెళ్ళి అయినవారు ఒకరినొకరు ఎడబాయకూడదు. ఏ కారణం చేతనైనా విడిపోతే మళ్ళీ వివాహం చేసుకోకూడదు. (**I** కొరి. 7:10,11) ఈ విషయంలో ఎవరి మట్టుకు వారు వ్యక్తిగతంగా దేవుని చిత్తం తెలుసుకొని తీర్మానం చేసుకోవడం మంచిది. వాస్తవంగా అలాంటి స్త్రీని పెళ్ళి చేసుకొంటే ధర్మశాస్త్రమును బట్టి వారిని రాళ్ళతో కొట్టి చంపాలి. దేవుడు దాన్ని అధిగమించమని చెప్పాడు. కారణం ఇశ్రాయేలీయులు యెహోవాను విసర్జించి వ్యభిచరించారు. దేవునికి దూరమైన ప్రతి విశ్వాసి ఈలాంటి ఆత్మీయ వ్యభిచారులని హోషేయ భార్య జీవితం ద్వారా దేవుడు స్పష్టం చేస్తున్నాడు.

చివరికి అతని పిల్లలు కూడ ఇశ్రాయేలుకు ఆత్మీయ పాఠాన్ని నేర్పిస్తున్నారు. వారికి పెట్టబడిన పేర్లు చెడు అర్థాలతో కూడినవి. యెజ్రెయేలు అంటే "చెదరగొట్టుట" అని అర్థం. ఈ పేరు, భవిష్యత్తులో జరుగబోయే సంఘటనలను సూచిస్తున్నది. దేవుడు, అహాబు రాజు, యెహూతో నాబోతు రక్తాన్ని చిందించినందుకు ప్రతీకారం తీర్చుకోమని చెప్పాడు. కాని అతని ప్రతీకారానికి హద్దులేకుండినది. అతడు ఉత్తరదేశపు రాజైన, యెహోరామును, దక్షిణ రాజ్యపు రాజైన అహజ్యాను ఒకే రోజు చంపాడు (**II** రాజు 9:14-28). యెజెబెలును, ఆహాబు 70 మంది కుమారులను, దూరబంధువులను, యూదా రాజకుమారులను బయలు ప్రవక్తలను చంపాడు (**II** రాజు 9:3; 10:1-23). అందుకే అతని 4 తరాలు మాత్రమే రాజ్యమేలుతాయని దేవుడు చెప్పాడు (2 రాజు 10:30). హోషేయకు యెజ్రెయేలు పుట్టినపుడు, యెహూవా 3వ తరం వాడైన **II** యరొబాము ఏలుతున్నాడు. కనుక త్వరలోనే అతని కుమారుడైన జెకర్యా కాలంలో

జరుగబోయే దానిని గూర్చి ప్రవచించాడు (హోషేయ 1:4; II రాజు 15:8-12).

"లోరూహామా" అంటే "జాలినొందనిది" అని అర్థం (హోషే 1:6). ఈ పేరు దేవుని తీర్పు సమీపంగా ఉందని సూచిస్తున్నది. అయితే అష్షూరీయుల దండయాత్రలో, దక్షిణ రాజ్యం మినహాయించబడతుందని దేవుడు వాగ్దానం చేసాడు. యూదావారిని దేవుడు రక్షించడానికి గల ఏకైక కారణం, ఆయన దావీదుతో చేసిన నిబంధననే (II సమూ 8:16; II రాజు 8:19; కీర్త 89:34-37).

దేవుడు ఇశ్రాయేలును క్షమించక పోవడానికి జాలినొందక పోవడానికి కారణం, దేవుని కృప వారిని చేరలేనంత లోతుగా పాపంలో దిగజారిపోయారు. ప్రియ సోదరా! సోదరీ! దేవుని కృపను, దయను తృణీకరిస్తూ పాపంలో కొనసాగితే ఒక దినాన ఆయన కృప నీకు దూరమౌతుంది. ఆయన నిన్ను చేరుకోలేడని కాదు గాని, నీవు అందుకు పాత్రునిగా ఉండవు. ఆయన నీ పట్ల జాలి చూపించడానికి నీలో ఏ కారణం ఉండదు.

హోషేయ తన దాంపత్య జీవితాన్ని కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నాలు 2వ అధ్యాయంలో చూడవచ్చును. అతడు తమ తల్లితో ఈ విషయాన్ని గూర్చి వాదించమని తన పిల్లలను బతిమిలాడాడు. (2:2,3) ఆమె మార్గాలకు ముండ్ల కంచెను అడ్డంగా వేసి బలవంతంగా ఆమెను ఇంట్లో ఉంచవచ్చునని అనుకొన్నాడు. (2:6) అయితే ఈ ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రతిసారి గోమెరు పారిపోడానికే ప్రయత్నించింది. చివరికి ఆమె అంద విహీనంగా మారిపోయి, అందరిచే తృణీకరించబడి, ఇతరులకు అమ్మబడినపుడు సయితం దేవుడు ఆమెను విడిపించమని చెప్పాడు. అది చాల కష్టమైన పని. హోషెయాకు అది ఇష్టం లేకపోవచ్చు. కాని దేవునికి విధేయత చూపించాడు. అసాధారణ పరిస్థితులలో దేవుడు తన ప్రవక్తల నుండి అసాధారణమైన విధేయతను ఆశించాడు. మీ జీవితంలో అలాంటి విధేయత ఉందా? హోషేయ దేవుడు చెప్పినట్లే చేసాడు. (3:12) అందుకు గల ఏకైక కారణం భార్యా భర్తల సంబంధంలో ఉండే ప్రేమ సూత్రం ఒక్కటే. ప్రేమ లేకుంటే అన్నీ వ్యర్థమే. ఈ ప్రేమ హృదయంలో నుండి రావాలి. అలాంటి ప్రేమనే దేవుని పట్ల కలిగి ఉండాలి. చిన్న చిన్న కారణాలకు వైవాహిక సంబంధాలను త్రెంచుకొనే వారికి హోషేయ జీవితం ఒక హెచ్చరికగా, స్ఫూర్తిగా ఉన్నది.

ప్రేమ సూత్రం ద్వారా జీవిత భాగస్వామిని క్షమించి చేర్చుకోగల మనస్సు వస్తుంది. దేవునికి విశ్వాసులకు గల ఆత్మీయ వైవాహిక సంబంధంలోని మాధుర్యాన్ని రుచిచూసిన వారందరూ హోషేయ వంటి మనస్సు కలిగి ఉంటారు. హోషేయ క్రీస్తు యేసునకు కలిగిన మనస్సుగలవాడు (ఫిలిప్పీ 2:5). దేవునికి ఇశ్రాయేలు జాతితో గల సంబంధం హోషేయ మరియు గోమెరు జీవిత అనుభవానికి పోల్చి చెప్పబడింది (2:19,20). ఇశ్రాయేలు జాతితో దేవుడు, ప్రధానము ద్వారా వైవాహిక నిబంధన చేసికొన్నాడు. ప్రధానం కన్యకతోనే జరుగుతుంది. అయితే ఇశ్రాయేలు పాపాన్ని బట్టి ఈ నిబంధనకు

దూరమైంది. కాని దేవుడు తన కొరకు వారిని తిరిగి సంపాదించుకోవాలని కోరాడు. అది కేవలం నీతినిబట్టి, కనికరాన్ని బట్టి జరుగుతుంది. వారు ఆధ్యాత్మికంగా తిరిగి దేవునివైపు తిరుగుతారని ప్రవచించబడింది. వారు నమ్మకస్తులు కారు గాని దేవుని నమ్మకత్వాన్ని బట్టి ఇది జరుగుతుంది.

**2. బాధపడుతున్న భర్త మరియు బాధకు కారణమైన భార్య - 4-14 అధ్యా**
(దేవునికి ఎఫ్రాయిముకు గల సంబంధం)

**అ. ఎఫ్రాయిము ఆక్షేపించబడింది** (Ephraim denounced). ఇశ్రాయేలీయులు దేవునిచే ఖండించబడడానికి మూడు ప్రధాన కారణాలున్నాయి. వారికి ధర్మశాస్త్రం ఇవ్వబడింది. దానిని పాటించిన ఏ వ్యక్తి అయినా, దేశమైనా దీవించబడుతుంది. అయితే ఇశ్రాయేలీయులు దేవుని వాక్యాన్ని తృణీకరించారు (4:6) ఆలాగే వారి విగ్రహారాధన (4:12,13,17) అనైతిక జీవితం (5:3) దేవుణ్ణి బాధపర్చాయి. దేవుని గూర్చిన జ్ఞానం వారికి లేదు. దయ, సత్యం, కనికరం కరువయ్యాయి. వారి పాపాన్ని బట్టి దేశం కూడ కలుషితమైంది. అందువలన భూమి, పశుపక్షాదులన్నీ శాపానికి లోనయ్యాయి (4:3). వారికి దేవుని వాక్యం చెప్పబడినా దాన్ని నిరాకరించారు. కనుక దేవుడు వారిని, వారి పిల్లల్ని కూడ మరచిపోతానని చెప్పాడు (3:6).

ఇశ్రాయేలు పాపానికి కారణం వారు అనుసరించిన మానవ పద్ధతేనని ప్రవక్త స్పష్టం చేసాడు (5:11). మనహేము మరియు హోషేయా పరిపాలన కాలంలో ఇశ్రాయేలు సహాయం కొరకు అష్షూరును ఆశ్రయించింది. (**II** రాజు 15:19, 20; 17:3,4) దేవుడే వారికి తీర్పు తీర్చాలని తీర్మానించాడు. కాబట్టి ఆ కాలంనాటి లోకసంబంధమైన శక్తులేవీ వారికి సహాయం చేయలేకపోయాయి. దేవుని నుండి వైదొలగిన ఇశ్రాయేలీయులు, దురవస్థల పాలయ్యారు. దేవుడు వారికి తన్ను మరుగుచేసుకొన్నాడు (5:6). మారు మనస్సు కొరకైన దేవుని పిలుపును నిర్లక్ష్యం చేస్తే మనం ఎలా తప్పించుకోగలం? (హెబ్రీ 2:3). వారు శీఘ్రంగా ఆయనను వెదకాలన్న ఉద్దేశంతోనే దేవుడు వారిని ఉపేక్షించాడు (5:15).

**ఆ. ఎఫ్రాయిము అపేక్షించబడింది** (Ephraim desired) **(6:4) :** ఆక్షేపించబడి ఉపేక్షించబడిన ఇశ్రాయేలును దేవుడు తిరిగి అపేక్షిస్తున్నాడు. వారిని విడచి పెట్టలేనంతగా ఆయన ప్రేమ "ఎఫ్రాయిమూ! నిన్ను నేనేమి చేతును? యూదా నిన్ను నేనేమి చేతును?" (6:4). "రెండు దినములైన తరువాత ఆయన మనలను బ్రది కించును. మనము ఆయన సముఖమందు బ్రదుకునట్లు మూడవ దినమున ఆయన మనలను స్థిరపరచును" (6:2). ఈ మాటలు, క్రీస్తు పునరుత్థానం ద్వారా మానవులందరికీ కలిగే నిత్యజీవితాన్ని సూచిస్తున్నాయని కొందరి అభిప్రాయం. ఆలాగే యెహెజ్కేలు 37వ అధ్యాయంలో తెలుపబడినట్లు, చెరనుండి తిరిగి వచ్చిన ఇశ్రాయేలు పునరుజ్జీవింపబడుతుందని మరికొందరి అభిప్రాయం. ఇది భవిష్యత్తులో జరుగబోయే

ఇశ్రాయేలీయుల సమకూర్పును కూడ సూచిస్తున్నది. అనగా సంఘాన్ని ఈ లోకం నుండి తీసికొని వెళ్ళాక ఆయన మళ్ళీ ఇశ్రాయేలు జాతివైపు తిరిగి, వారిని పునరుద్ధరిస్తాడు. ఈ విషయాన్ని గూర్చి ప్రతి ప్రవక్త మరియు మోషే కూడ ప్రవచించారు. అది శాశ్వతమైన సమకూర్పు. ఈ సమకూర్పు కూడ క్రీస్తు పునరుత్థానంతో సంబంధం కలిగి ఉన్నది. క్రీస్తు మరణ పునరుత్థానాల వల్ల సంఘం యొక్క అంకురార్పణ జరిగింది. దేవుడు యూదులను అన్యులను రక్షించడానికే సంఘాన్ని నిర్మించాడు. దాని గూర్చి పౌలు రోమా11వ అధ్యాయంలో వర్ణించాడు. ఈ ఉద్దేశం పూర్తికాగానే సంఘం ఎత్తబడుతుంది. సంఘముగా, విశ్వాసులు దేవుని యొక్క ఈ ఉద్దేశాన్ని పూర్తి చేసినపుడే ఇశ్రాయేలీయులు సమకూర్చబడతారు. ఈ బాధ్యతను ఎప్పుడైనా గుర్తించావా?

ఇ. **ఎఫ్రాయిము వర్ణించబడింది** (Ephraim described) : ఇశ్రాయేలు పాపం బహిరంగముగా కనిపిస్తున్నది. (7:1) అది వారి పురోగతిని చూపించడం లేదుగాని వారు నాగరికతను కోల్పోయారనడానికి సూచనగా ఉన్నది. వారు అధిక వేడిమిగల మంటలుగా ఉన్నారని దేవుడు వర్ణిస్తున్నాడు (7:4). రాత్రంతా ప్రజల హృదయాలు దుష్టపన్నాగాలతో నింపబడి ఉదయానికల్లా మంటల్లా చెలరేగుతున్నాయి. ఎఫ్రాయిము అన్యజనులతో కలిసిపోయి, త్రిప్పి వేయబడని అప్పమువలె నిష్ప్రయోజకులయ్యారని (7:8), బుద్ధిలేని పిరికి గువ్వలవలె సహాయం కొరకు ఐగుప్తీయులను పిలుచుకొన్నారని, అష్షూరీయుల వద్దకు వెళ్ళారని (7:11), దేవున్ని మహిమ పర్చాలన్న గురిని తప్పిన, అక్కరకురాని విల్లులా ఉన్నారని (7:16), అన్యజనుల మధ్య ఎవరికీ ఇష్టముకాని ఘటముగా ఉన్నారని (8:8), అడవిగార్ధభం తన ఆశను తీర్చుకొనబోయినట్లు ఇశ్రాయేలు అష్షూరుకు వెళ్ళిందని (8:9) వారు ఎండిపోయినవేరులా ఉన్నారని (9:16), విస్తారంగా వ్యాపించి ఫలించిన ద్రాక్షావల్లిలాగ ఉన్నప్పటికినీ, ఫలించిన కొలది మరి ఎక్కువ పాపం చేసారని (10:1) మొండితనం గల పెయ్యాలా (4:16) ఉన్నారని దేవుడు వర్ణిస్తూ వాపోతున్నాడు. అందుకు ప్రధాన కారణం వారి రాజులేనని, అందుకే వారందరు నాశనమయ్యారని స్పష్టం చేసాడు (7:7). యరొబాము మొదలుకొని ఉత్తర ఇశ్రాయేలు రాజులందరూ, ప్రజలు పాపం చేయడానికే కారణమయ్యారు. దక్షిణ రాజ్యంలో మత సంస్కరణలు జరిగించిన మంచి యూదా రాజులవలె ఉత్తర రాజ్యంలో ఒక్క రాజుకూడ లేడు. వారిలో అనేకులు ఇతరులచే హత్యగావించబడ్డారు.

ఈ. **ఎఫ్రాయిము శిక్షించబడింది** (Ephraim disciplined) : ఇశ్రాయేలు పొందే శిక్షను గూర్చి దేవుడే ప్రకటించాడు. వారి పాపానికి తగిన ప్రతిఫలాన్ని పొందుతారని చెప్పాడు. (8:7; 10:13) దేవుడు కొంతకాలం మట్టుకు తన కృప చూపడం మానేసాడు (2:4).

వారి శిక్షలో భాగంగా వారు అనేక దినాలు రాజు లేకుండ ఉన్నారు (3:4). ఇశ్రాయేలు చివరి రాజైన హోషేయ క్రీ.పూ. 72 సంవత్సరంలోను, యూదా చివరి రాజైన సిద్కియా క్రీ.పూ. 587 సంవత్సరంలోను సింహాసనం నుండి తొలగించబడ్డారు. ఆ తరువాత

6 శతాబ్దాల (600 సంవత్సరాల) అనంతరం ఇశ్రాయేలు నిజమైన రాజు, యేసుక్రీస్తు వచ్చినా, ఆయన తృణీకరించబడ్డాడు (యోహాను 19:15). ఆయన మళ్ళీ తిరిగి వచ్చేంత వరకు వారు రాజు లేకుండానే ఉంటారు (ప్రక. 19:11-16). అంతమాత్రమే కాదు వారు అనేక దినాలు అధిపతి లేకుండ ఉంటారని కూడ హోషేయ ప్రవక్త చెప్పాడు. ఇశ్రాయేలుకు అధిపతిగా ఉంటాడని చెప్పబడిన వ్యక్తి, వెయ్యేండ్ల పాలన వచ్చేంత వరకు పని చెయ్యడు (యెహె. 44:3). బలులు కూడ నిలిపివేయబడతాయన్న హోషేయ ప్రవచనం, క్రీ.శ. 70వ సంవత్సరములో టైటస్ అనే రోమీయుడు యెరూషలేము దేవాలయాన్ని నాశనం చేసినప్పుడు నెరవేర్చబడింది. మహాశ్రమల కాలంలో తిరిగి బలులు అర్పించబడతాయి గాని క్రీస్తు విరోధి వాటిని నిలిపివేస్తాడు (దాని. 9:27). ఇక దేవతాస్తంభాలు దేవాలయానికి, మరియు ఏఫోదు ప్రధానయాజకులకు సూచనగా ఉన్నాయని, ఇక మీదట అవి మరియు గృహదేవతలు ఉండబోవని తెలుస్తున్నది. మహాశ్రమల కాలంలో మందిరం నిర్మించబడుతుంది (ప్రక. 13:6). కాని తిరిగి నాశనం చేయబడుతుంది (జెకర్యా 14:2). చివరిగా వెయ్యేండ్ల పాలనలో పునర్నిర్మించబడుతుంది (యెహె. 40:48). ఇశ్రాయేలీయులు దేవుణ్ని విడచి వేటిని ఆధారంగా చేసికొన్నారో వాటన్నిటిని, వారిని శిక్షించడానికే దేవుడు ఉపయోగించాడు (10:2-6). వారు దేవుణ్ణి రాజుగా చేసుకోకుండ మానవులను రాజులుగా నియమించుకొన్నారు. ఆ రాజుల నైతిక పతనమే వారి పతనానికి, దాని ఫలితమైన శిక్షకు కారణమైంది (8:1-7). ఇశ్రాయేలీయులు భూఫలంవైపు, సంపదలవైపు తిరిగారు. దేవుడు వాటిని లేకుండ చేసాడు (9:1-3). వారు అన్యదేశాలలో చెదరగొట్టబడ్డారు (9:17) ఉత్తర రాజ్యంలోని 10 గోత్రాలు చెదరిపోయాయి. బబులోను చెరనుండి తిరిగి వచ్చిన యూదా, బెన్యామీను గోత్రాలతో పాటు మిగతా 10 గోత్రాల వారు కొద్దిమందే తిరిగి వచ్చినా, వారి గోత్రం పేరు సయితం తెలియని వారున్నారు (ఎజ్రా 2:59-62).

విత్తుట కోయుట అనే సూత్రాన్నే దేవుడు ఇశ్రాయేలును శిక్షించడానికి ఉపయోగించాడు (10:12). మనుష్యులు ఏమి విత్తుతారో దాన్నే పంటగా కోస్తారన్న సూత్రం బైబిలు అంతటా ప్రస్తావించబడింది. ఈ పాఠాన్ని ఇశ్రాయేలు వినలేదు. ప్రియ పాఠకులారా! ఈ భూమి మీద ఎంతో ప్రాముఖ్యమైన మన జీవిత విధానం ద్వారా మనం విత్తుతున్నదేదో జాగ్రత్త కలిగి ఉండనట్లయితే, ఒకానొక దినాన తప్పకుండ దాని పంటను కోయాల్సి ఉంటుంది. జాగ్రత్త సుమా! (గల 6:7-9).

మనం కొంతమందిని ఎప్పుడూ మోసం చేయవచ్చును. కాని అందరినీ అన్ని పర్యాయాలు మోసం చేయలేము, అందర్నీ మోసం చేసినా దేవుణ్ణి మాత్రం మోసం చేయలేము. ఈ సూత్రంలోని మరో ప్రాముఖ్యత ఏమంటే విత్తినదానికన్న ఎక్కువ పంటకోస్తాము. దేవుడు ఇశ్రాయేలును ఈ విధానంలో శిక్షించినా, తన ప్రేమతో బంధించాడు. వారు

తన వైపు తిరగాలన్న మంచి ఉద్దేశంతోనే శిక్షించాడు (హోషే. 5:15). ఆయన శిక్షలోనికి రావడం విశ్వాసికి మేలు (హెబ్రీ 2:5,6).

ఉ. **ఎఫ్రాయిము విమోచించబడింది (Ephraim delivered) :** ఒకానొక దినాన ఇశ్రాయేలీయులు విమోచించబడే మహిమాన్విత సంఘటన జరగబోతున్నదని హోషేయ తన గ్రంథమంతటా అక్కడక్కడ ప్రస్తావించాడు.

*"నీవు నిత్యము నాకుండునట్లుగా నేను నీతిని బట్టి తీర్పు తీర్చుట వలనను దయాదాక్షిణ్యములు చూపుట వలనను నిన్ను ప్రధానము చేసికొందును" (2:19).*

*"జాలినొందని దాని యందు నేను జాలి చేసికొందును; నా జనము కాని వారితో, మీరే నాజనమని నేను చెప్పగా వారు-నీవే మా దేవుడవు అని అందురు" (2:23).*

*"తరువాత ఇశ్రాయేలు తిరిగి వచ్చి తమ దేవుడైన యెహోవా యొద్దను, తమ రాజైన దావీదునొద్దను విచారణ చేయుదురు" (3:5).*

*"రెండు దినములైన తరువాత ఆయన మనలను బ్రతికించును, మనము ఆయన సముఖమందు బ్రదుకునట్లు మూడవ దినమున ఆయన మనలను స్థిరపరచును". (6:2).*

అలాగే 6:3; 11:1,4,8,9; 13:10,14; 14:4-7 కూడ చదవండి.

ఇశ్రాయేలు శిక్షించబడాలి గాని దేవుడు వారిని విడిచిపెట్టలేదు, "ఎఫ్రాయిము నేనెట్లు నిన్ను విడిచి పెట్టుదును?" (11:8) అంటున్నాడు. ఆయన వారిని దహించేంతగా కోపపడడు అని జ్ఞాపకం చేస్తున్నాడు (11:9). కేవలం గుణపర్చడానికే శిక్షించాడు తిరిగి మనస్ఫూర్తిగా స్నేహించాడు (11:4; 14:4). అందుకు వారు చేయాల్సిందల్లా వారి పాపాలు ఒప్పుకొని దేవునివైపు తిరగాలి (14:1-3). అప్పుడు వారు తిరిగి చిగురిస్తారు, వికసిస్తారు, ఫలిస్తారు (14:6-8).

హోషేయ చెప్పిన ఈ ప్రవచనం ఇంకా పూర్తిగా నెరవేర్చబడలేదు. ఇప్పటి వరకు రక్షించబడిన ఇశ్రాయేలీయులు కొద్దిమందే, కాని భవిష్యత్తులో మహాశ్రమల కాలం, వారికి రక్షణ పొందేకాలంగా ఉంటుంది. దేవుని ప్రేమ గెలుస్తుంది. దేవుని మార్గాలు చక్కనివి. నీతిమంతులు దాని ననుసరించి నడచుకొంటారు గాని తిరుగుబాటు చేసేవారికి అది అడ్డుబండగా ఉంటుంది గనుక వారు తొట్రిల్లుతారు. (హోషే 14:9) మనం దేవుణ్ణి చేరడానికి యేసుక్రీస్తు ఒకే ఒక మార్గాన్ని స్థాపించాడు (హెబ్రీ 10:19, 20) ఆయనే ఆ మార్గము (యోహా 14:6). ఆ మార్గంలో నడచినవారు రక్షించబడతారు. అవిశ్వాసులకు, ఆయనను తృణీకరించేవారికి అదే అడ్డుబండగా మారుతుంది (I పేతు 2:6-8). మీరు ఆ మార్గాన్ని ఎన్నుకున్నారా? ఎన్నుకోని పక్షంలో ఈ రోజే ఒక తీర్మానం చేసికొని రక్షణ పొందండి.

# గొప్ప తీర్పు

## యోవేలు గ్రంథం - సంగ్రహ సమీక్ష

## I. ఉపోద్ఘాతం :

మూడు అధ్యాయాలు మాత్రమే ఉన్న యోవేలు గ్రంథంలోని ప్రవచనాలు అంత ప్రాముఖ్యమైనవిగా అనిపించకున్నా ఈ పుస్తకం ఒక ఆటంబాంబులాంటిది. ఇది పెద్ద పుస్తకం కాకున్నా చాల శక్తివంతమైనది.

1. **గ్రంథకర్త :** చిన్న ప్రవక్తల గ్రంథం సరళిలో రెండవ పుస్తకమైన యోవేలు గ్రంథాన్ని పెతూయేలు కుమారుడైన యోవేలు వ్రాసాడని ఆ గ్రంథం ప్రారంభంలోనే స్పష్టమౌతున్నది (1:1). ఇంతకుమించి అతని వివరాలేవీ తెలియదు గాని అతడు యూదారాజైన యోషీయా కాలంలో, దక్షిణ రాజ్యంలో ప్రవచించాడని తెలుస్తుంది. అలా అయితే అతడు బహుశా ఏలియా మరియు ఏలిషా సమకాలికుడని చెప్పవచ్చును. యోవేలు అన్న పేరుకు "యెహోవాయే దేవుడు" అని అర్థం.

2. **గ్రంథ రచన కాలం :** ఈ గ్రంథం యూదయ ప్రాంతం నుండి వ్రాయబడిందన్నది స్పష్టమే కాని ఏ కాలంలో వ్రాయబడిందో చెప్పడం కష్టం. క్రీ.పూ. 800-200 మధ్య కాలమని కొందరు పండితుల అభిప్రాయం. ఇంకా ముందు వ్రాసాడనడానికి ఆధారాలేమి లేవు.

3. **ముఖ్యాంశం :** ఈ గ్రంథంలో యెహోవా దినము అన్నది ప్రధానాంశం. యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు, దానియేలు మొదలైన ప్రవక్తలు కూడ యెహోవా దినమును గూర్చి చెప్పారు. ఈ అర్థాన్ని స్ఫురింపజేస్తూ తన గ్రంథంలో 5 సార్లు ప్రస్తావించాడు (1:15; 2:1,2; 2:10,11; 2:30,31; 3:14,16). "యెహోవా మందిరము"ను గూర్చి కూడ యోవేలు పలుమార్లు ప్రస్తావించాడు (1:9,13,14,16; 2:17; 3:18). దీనిని బట్టి అతడు యెరూషలేములోను, దాని పరిసర ప్రాంతాలలోను ప్రవచించాడని చెప్తారు (3:1,16,17,21).

## II. యోవేలు గ్రంథ విభజన :

1. **స్థానికంగా సంభవించిన మిడుతల తెగులు 1:1-14**
2. **యెహోవా దినమును దృష్టించుట (ప్రథమ ఘట్టం) 1:15-2:32**
3. **యెహోవా దినమును దృష్టించుట (అంతిమ ఘట్టం) 3 అధ్యా**
   అ. మహాశ్రమల కాలం 3:1-15
   ఆ. వెయ్యేండ్ల పాలన 3:16-21

అధ్యాయాల వారిగా మరో రీతిగా కూడ విభజించవచ్చును.

మొదటి అధ్యాయం - యూదుల పాపమును బట్టి రానున్న శిక్ష

రెండవ అధ్యాయం – శత్రువు ద్వారా కలిగే నాశనం మరియు వాగ్దానం చేయబడిన విడుదల.
మూడవ అధ్యాయం – అన్యజనులపై దేవుని తీర్పు – యూదుల సమకూర్పు.

## III. అంశాలవారిగా యోవేలు గ్రంథం సంగ్రహ సమీక్ష :

**1. ఇశ్రాయేలు, మరియు మిడుతల ద్వారా దేవుని తీర్పు (1:1-20).**

**అ. మిడుతల ద్వారా కలిగిన తీర్పు యొక్క తీవ్రత మరియు దాని అక్షరార్థం (1:4) :** దేవుడు తీర్పు కొరకు తరచుగా మిడుతలను పంపించడం పరిపాటి (ద్వితీ 29:38-42; నిర్గ 10:12-15; **II** దిన. 7:13; ప్రక. 9:1-12). వీటిలో మూడు తెగుళ్ళు విశేషమైనవి. ఐగుప్తులో దేవుడు పంపించిన మిడుతల తెగులు ఒక అద్భుతం (నిర్గ. 10:12-15). యోవేలు కాలంలో సంభవించిన తెగులు ప్రకృతిలో సహజసిద్ధంగా వచ్చినది. భవిష్యత్తులో మహాశ్రమల కాలంలో రాబోయే మిడుతల తెగులు అసాధారణమైనది (ప్రక. 9:3-10).

యోవేలు యూదయలో పరిచర్య చేసిన కాలంలో వచ్చిన తెగులు అంతకు ముందు ఎప్పుడూ రాలేదు. దాని తీవ్రత విపరీతంగా ఉండినది (1:2). అతని కాలంలో వచ్చిన ఈ తెగులు త్వరలో వారిపైకి రానున్న అష్షూరీయులను గూర్చి కూడ ఒక సూచనగా, హెచ్చరికగా ఉన్నది. ఇక్కడ యోవేలు వివరించిన మిడుతలు (1:2-4) హీబ్రూభాషలో 4 వేరు పేర్లతో వ్రాయబడింది. ఇవి నాలుగు వేరు వేరు రకాలైయుండవచ్చును లేదా ఒకే జాతి మిడుతల ఎదుగుదలలో నాలుగు దశలై ఉండవచ్చును. ఏది ఏమైనా ఈ తెగులు వలన తీవ్ర నష్టం కలిగింది (1:7, 8-12). దీనిని గూర్చి యూదావారు తమ బిడ్డలకు తెలియజేయాలని, వారు తమ తరువాత తరానికి దానిని తెలియజేయాలని దేవుడు కోరాడు (1:3). వాస్తవంగా కలిగిన ఈ తెగులును వర్ణిస్తూ, ప్రవక్త దానిని త్వరలో రాబోతున్న దేవుని తీర్పుగా గ్రహించి, ప్రజలను హెచ్చరించాడు. త్వరలో వారి దేశాన్ని స్వాధీనం చేసుకోబోతున్న పారసీకులు, గ్రీకులు, రోమీయులను ఈ కీటకాలతో పోల్చి ఉండవచ్చును. వీరందరూ యూదా వారిపైబడి, పురుగులు తినివేసినట్లుగా వారిని పాడుచేసారు.

**ఆ. మిడుతల ద్వారా కలిగిన తీర్పు - దాని అంతరార్థం (1:15) :** యోవేలు, తన కాలంలో మిడుతల ద్వారా కలిగిన తెగులును "యెహోవా దినము" అని పిలిచాడు. చరిత్రలో జరిగిపోయిన ఈ సంఘటన ద్వారా, త్వరలో రాబోతున్న అన్యుల పాలన కాలాన్ని గూర్చి మాత్రమే కాకుండా, భవిష్యత్తులో రాబోతున్న దేవుని తీర్పును గూర్చి, అనగా మహాశ్రమల కాలాన్ని గూర్చి కూడ యోవేలు హెచ్చరిస్తున్నాడు. "యెహోవా దినము"ను గూర్చి పాత నిబంధనలోను క్రొత్త నిబంధనలోను పలుమార్లు ప్రస్తావించబడింది. ప్రవక్తల గ్రంథాలలో ఈ దినాన్ని గూర్చి మొదట ప్రస్తావించినవాడు యోవేలు. ఒలీవల కొండపైన యేసు శిష్యులు, ఈ యుగ సమాప్తికి సూచనలేమని అడిగినపుడు, ఆయన సిలువను గూర్చి గాని, పరిశుద్ధాత్మను గూర్చిగాని, సంఘము

ఎత్తబడుటను గూర్చిగాని చెప్పలేదు గాని ప్రభువు దినమును గూర్చే చెప్పడం ప్రారంభించాడు (మత్త 24:15).

యోవేలు చెప్పినట్లే లోకారంభము నుండి ఇప్పటి వరకు అట్టి శ్రమ కలుగలేదని చెప్పాడు (మత్త 24:21). "యెహోవా దినము" ప్రభువు దినమని కూడ పిలువబడుతున్నది. అయితే ప్రకటన 1:10లో చెప్పబడిన ప్రభువు దినము (యేసుక్రీస్తు పునరుత్థానుడైన దినము) వేరు. యెహోవా దినము లేక ప్రభువు దినము అన్నది 24 గంటల కాలం కలిగిన ఒక దినము కాదు గాని ఒక పరిమిత కాల సమయము అని గ్రహించాలి. పాత నిబంధన ప్రవక్తలు ఈ దినాన్ని గూర్చి ప్రవచించినా, "యెహోవా దినము" అన్నది వారికి ఒక వింతగానే ఉండినది. వీరికి ఆయా జాతుల నుండి ఒక గొప్ప శరీరముగా ఏర్పాటు చేయబడిన సంఘమును గూర్చి గాని, దాని భవిష్యత్తును గూర్చి గాని తెలియదు గనుక ఈ ప్రభువు దినము ఎప్పుడు ప్రారంభమౌతుందో వారికి తెలియదు. అయితే అపొస్తలుడైన యాకోబు, సంఘ కాలమునకు మరియు ప్రభువు దినానికి గల సంబంధాన్ని ఆమోసు 9:11ను ఆధారం చేసికొని కొంత వరకు వివరించాడు. "ఇందుకు ప్రవక్తల వాక్యములు సరిపడియున్నవి; ఎట్లనగా ఆ తరువాత నేను తిరిగి వచ్చెదను; మనుష్యులలో కడమవారును నా నామము ఎవరికి పెట్టబడెనో ఆ సమస్తమైన ఆన్యజనులును ప్రభువును వెదకునట్లు పడిపోయిన దావీదు గుడారమును తిరిగి కట్టెదను". (అపొ.కా. 15:15-17).

ఆ తరువాత అంటే, సంఘము ఎత్తబడ్డాక అని అర్థం. అప్పుడు దేవుడు తన అనాదికాల సంకల్పం ప్రకారం తిరిగి ఇశ్రాయేలు జాతివైపు తన దృష్టిని మరలుస్తాడు. అదే "ప్రభువు దినము" యొక్క ప్రారంభం. అది చీకటితో ప్రారంభించబడుతుందని చెప్పబడింది (యోవే 2:2) యూదుల కాలమానం ప్రకారం అస్తమయం (చీకటి)తోనే దినము ప్రారంభమౌతుంది (ఆది 1:5). అదే విధంగా ప్రభువు దినము కూడ శ్రమలు అనే చీకటితో ప్రారంభమౌతుంది (మత్త 24:15,21). కనుక ఈ ప్రభువు దినం సంఘం ఎత్తబడిన వెంటనే, మహాశ్రమల కాలంతో ప్రారంభమౌతుంది.

**2. ఇశ్రాయేలు మరియు శత్రుదాడుల ద్వారా దేవుని తీర్పు (2:1-3:21)**

**అ. దాడిని గూర్చిన గుర్తింపు :** యోవేలు 2, 3 అధ్యాయాలలో ఏ దేశమును గూర్చి లేక శత్రువును గూర్చి చెప్పాడో మొదట గుర్తించాలి. యూదా వారి పాపమును బట్టి అష్షూరీయులు, బబులోనీయులు చేసిన దాడులను గూర్చి చెప్పి ఉండవచ్చునని కొందరి అభిప్రాయం. అది వాస్తవమే అయినా, యోవేలు 2:20లో చెప్పబడినట్లు భవిష్యత్తులో ఉత్తర దిక్కు నుండి వచ్చే రష్యా దాడి, అనగా యెహెజ్కేలు 38, 39 అధ్యాయాలలో వివరించబడిన దాడిని గూర్చి కూడ యోవేలు హెచ్చరిస్తున్నట్లు కనిపిస్తున్నది. (యోవేలు 2:20ను యెహెజ్కేలు 39:11-15 పోల్చి చదవండి).

ఈ దాడులనే కాకుండ, అంతంలో క్రీస్తు విరోధి ద్వారా జరిగించబడే హార్‌మెగిద్దోను యుద్ధమును గూర్చి కూడ యోవేలు ప్రవచించాడు (ప్రక 16:13-16; 19:11-21).

ఆ. **దాడి జరిగే స్థలం :** చరిత్రలో కెల్ల అతి ఘోరమైన ఈ యుద్ధం, యెహోషాపాతు లోయలో జరుగుతుంది (3:21, 12). దీనినే కిద్రోను లోయ అని కూడ అంటారు. ఉత్తరాన మెగిద్దోను పట్టణం మొదలుకొని (జెక 12:11; ప్రక. 16:15) దక్షిణాన ఎదోము వరకు (యెష 34:5, 6; 63:1) 200 మైళ్ళ విస్తీర్ణంలోను, పశ్చిమమున మధ్యధరా సముద్రం నుండి, తూర్పున మోయాబు పర్వతాల వరకు 100 మైళ్ళ విస్తీర్ణంలో అనగా మొత్తము వెయ్యి చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఈ యుద్ధం జరుగుతుంది. ఒలీవల కొండలకు మరియు పరిశుద్ధ పట్టణానికి మధ్యలో ఉన్న యెహోషాపాతులోయ ఈ యుద్ధభూమిలో సరిగ్గా కేంద్రబిందువులా ఉంటుంది.

ఇ. **ఈ దాడి యొక్క ఉద్దేశం :** ఈ దాడి కొరకు సమకూర్చబడడంలో రెండు ఉద్దేశాలున్నాయి.

1. క్రీస్తు విరోధి ఉద్దేశం – ఇశ్రాయేలును, దాని దేవుణ్ణి నాశనం చేయడం (2వ కీర్తన).
2. దేవుని ఉద్దేశం – క్రీస్తు విరోధిని వాని అనుచరుల్ని నాశనం చేయడం (ప్రక. 16:12-16; 20:7-10).

ఈ. **దాడి యొక్క ఫలితం : (యోవే 3:15,16, ప్రక. 19:11-21)**

ఈ హార్‌మెగిద్దోను యుద్ధం ముగిసిన తరువాత లభించే ఆశీర్వాదాలను గూర్చి 2:28-32 వరకు, వ్రాయబడింది.

1. మొదటి ఆశీర్వాదం : భౌతిక పరమైన అవసరాలన్నీ తీర్చబడతాయి (2:21-27).

2. రెండవ ఆశీర్వాదం : సర్వజనుల మీద ఆత్మ కుమ్మరించబడుతుంది (2:28,29) ఈ భాగము అనగా 2:28-32 వరకు, హెబ్రీ భాషలోని మూల ప్రతులలో ప్రత్యేక అధ్యాయముగా వ్రాయబడిందని డా॥ చార్లెస్ ఎల్. ఫెయిన్‌బర్గ్ అనే బైబిలు పండితుడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రత్యేక సంఘటన అనగా ఆత్మకుమ్మరింపు జరుగబోయే కాలమును సూచిస్తూ ఈ భాగము, తరువాత అన్న మాటతో ప్రారంభించబడింది. అనగా మహాశ్రమల కాలము మరియు వెయ్యేండ్ల పాలన తరువాత ఈ సంఘటన జరుగుతుంది. ప్రవక్తలెవరేగాని ఈ సంఘటన సంఘకాలములో జరుగుతుందని చెప్పలేదు గాని అంత్య దినాలలో ఇశ్రాయేలు జాతికి జరుగబోయే దానిని గూర్చే చెప్పారు (యెష 32:15; యెహె 36:27,28; 37:14; 39:28,29; జెకర్యా 12:10). కనుక ఇది పెంతెకొస్తు దినాన జరిగిన సంఘటన కాదని గమనించాలి. ఈ సందర్భంలో శిష్యులు మత్తులైయున్నారన్న అపోహను ప్రజలలో నుండి తొలగించడానికే పేతురు యోవేలు ప్రవచనాన్ని జ్ఞాపకం చేసాడు గాని ఆ ప్రవచనం నెరవేరిందని చెప్పలేదు (అపో. 2:17-21). ఆ మహాదినం రాకముందు ఏమి జరుగుతుందో కూడ అతడు జ్ఞాపకం చేసాడు (అపో. 2:20). పెంతెకొస్తు గొప్ప దినమే కాని ఆ మహాదినం కాదు. పెంతెకొస్తు దినాన కలిగిన అనుభవం యేసుక్రీస్తు వాగ్ధానం చేసిన దానిని బట్టే జరిగిందని పేతురు స్పష్టం చేసాడు (అపో. 2:32, 33; యోహాను 14:16,17). పెంతెకొస్తు దినాన,

ఆయా ప్రాంతాల నుండి వచ్చిన కొంత మంది యూదులే ఆ అనుభవాన్ని రుచి చూసారు కాని ప్రపంచమంతా చెదరి ఉన్న ఇశ్రాయేలీయులందరు సమకూర్చబడి తిరిగి ఒక దేశముగా ఏర్పడిన రోజు ఈ ప్రవచనం నెరవేర్చబడుతుంది. ఇశ్రాయేలీయులందరు ఆత్మతో నింపబడాలన్న మోషే హృదయవాంఛ ఈ విధంగా తీర్చబడుతుంది (సంఖ్యా 11:29).

3. **మూడవ ఆశీర్వాదం :** ప్రకృతి సయితం రూపాంతర పర్చబడుతుంది. ఇది క్రీస్తు రాజ్య పాలనలో జరుగుతుంది. ఈ దినాన ఇశ్రాయేలు దేశంలో నీటి కొరత ఉండవచ్చును గాని ఆ దినమున యెహోవా మందిరములో నుండి నీటి ఊట ఉబికి షిత్తీము లోయను తడుపుతుంది (3:18). షీత్తీము యొర్దాను అవతల ఉన్నది. ఇవతల ఉన్న యోరూషలేము నుండి అక్కడికి నీళ్ళు ఎలా ప్రవహిస్తాయి? జెకర్యా 14:4-8 చదివితే అర్థమౌతుంది. సాధారణంగా ఉత్తరాన లెబానోను నుండి ప్రవహించే నీరు గలిలయ సముద్రం, యోర్దాను గుండా దక్షిణం వైపు ప్రవహించి మృత సముద్రంలో కలుస్తాయి. (బైబిలులో చివరి పేజీలలో ఉన్న పాలస్తీన పటంలో చూడవచ్చును) అయితే ప్రపంచ దేశాలన్నీ ఒక్కటై ఇశ్రాయేలుపైకి యుద్ధానికి వచ్చినప్పుడు, క్రీస్తు తానే వారితో యుద్ధం చేయడానికి, యెరూషలేముకు తూర్పుతట్టు ఉన్న ఒలీవల కొండ మీద ఆయన పాదాలుంచినపుడు, ఆ కొండ మధ్యకు విడిపోయి సగము ఉత్తరపు తట్టుకు, సగము దక్షిణపు తట్టుకు జరుగుతుంది. అప్పుడు ఉత్తరం నుండి పారే నీళ్ల అక్కడే నిలిచిపోతాయి. కాని తూర్పున యెరూషలేము మందిరం నుండి ఉబికిన ఊట పశ్చిమమున ఉన్న షిత్తీమువైపు ప్రవహిస్తుంది.

4. **నాల్గవ ఆశీర్వాదం :** క్రీస్తు తానే సీయోనులో నివసించి, పరిపాలిస్తాడు. ఈ సీయోను పర్వతం ఒకప్పుడు పట్టణ ప్రాకారం లోపలనే ఉండినది. అక్కడ దావీదు సమాధి ఉన్నది గనుక ఇశ్రాయేలీయులు దానిని ఒక పవిత్ర స్థలంగా ఎంచారు. యేసుక్రీస్తు తన శిష్యులతో చివరి పస్కాను భుజించిన మేడగది కూడ దీనిపైననే ఉన్నదని చెప్తారు (మార్కు 14:12-16; లూకా 22:7-13). అలా అయితే ఈ మేడగదిలోనే అపొస్తలులతో కలిపి 120 మంది ప్రార్థిస్తూ ఉండగా పరిశుద్ధాత్మను పొందారని తలంచవచ్చును (అపొ.కా. 1:12-14; 2:1-4). ఆయన సీయోనులో నివసిస్తాడు గనుక యూదాదేశములో ఇశ్రాయేలీయులు నిత్యము నివసిస్తారు. తరతరాలకు యెరూషలేము నివాస స్థలంగా ఉంటుంది (3:21).

ప్రియ సోదరా! సోదరీ! దేవుడు ఎంత కరుణగలవాడో అంతగా పాపమును ద్వేషిస్తాడు. ఇశ్రాయేలు పాపాన్ని బట్టి తీర్పు తీర్చబడినా, వారికి విడుదల సిద్ధం చేయబడింది. అలాగే మన పాపమునకు ప్రాయశ్చిత్తము తానే చేసాడు. తనవైపు తిరిగిన వారిని, వారు ఎంత ఘోరపాపులైనా పశ్చాత్తాపముతో మారుమనస్సు పొందితే క్షమిస్తాడు. వారితో నిత్యము ఉంటాడు. వారిని తిరిగి సమకూరుస్తాడు. అట్టి ధన్యత మీరు కూడ పొందాలని మా ఆకాంక్ష.

# గొప్ప న్యాయ తీర్పు

## ఆమోసు గ్రంథం - సంగ్రహ సమీక్ష

**I. ఉపోద్ఘాతం :**

క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దములో వ్రాయబడిన ప్రవచన గ్రంథాలలో ఆమోసు ఒకటి.

**ఎ. గ్రంథకర్త :** గ్రంథకర్త ఆమోసు అని, ఇతడు తెకోవలోని ఒక పసులకాపరి అని గ్రంథంలోనే వ్రాయబడింది. (1:1) తెకోవ బేత్లేహేముకు ఆగ్నేయ దిశలో ఉన్నది. ఇతడు యూదా రాజైన ఉజ్జీయా మరియు ఇశ్రాయేలు రాజగు యెహోయాషు కుమారుడైన యరొబాము దినములలో జీవించాడు. ఆమోసు మరియు హోషేయ సమకాలికులు, హోషేయా దేవుని ప్రేమను గూర్చి చెప్పాడు. ఆమోసు దేవుడు నీతిమంతుడు గనుక తీర్పు తీరుస్తాడని చెప్పాడు. ఆమోసు పేరుకు, "భారభరితుడు", అని అర్థం. అతడు ఇశ్రాయేలీయుల పట్ల అతని హృదయంలో భారాన్ని భరించాడు.

**బి. గ్రంథకర్త పిలుపు :** సాధారణంగా ఎవరిని గూర్చైన ఇతడు దైవజనుడు అని చెప్పబడితే వెంటనే మన మనస్సులో కలిగే తలంపులేవంటే అతడు అభిషిక్తుడైన సేవకుడని, లేక ప్రఖ్యాతిగాంచిన సువార్తికుడని, వేదాంత పండితుడని లేక వృత్తిపరంగా దేవుని వాక్యాన్ని బోధించేవాడని అనుకొంటాము. కాని ఆమోసు దైవజనుడైనా సంపూర్ణ సేవకుడు కాడు. అతడు అర్చకేతరుడు. ఆమోసు పిలుపును గూర్చి 7:15 లో స్పష్టంగా వ్రాయబడింది. వాస్తవానికి అతడు ప్రవక్త కాదు, ప్రవక్త యొక్క శిష్యుడు అంతకన్నాకాదు. కాని తాను ఒక పసుల కాపరి అని మేడిపండ్లు ఏరుకొనేవాడని, దేవుడు అతన్ని పిలిచి ఇశ్రాయేలీయులకు ప్రవచనం చెప్పమని పంపించాడని అతడు నిశ్చయంగా చెప్పాడు. దేవుని సేవకులైనవారు తమ పిలుపును గూర్చి ఖచ్చితంగా తెలిసికొని ఉన్నప్పుడే ఇతరులతో ధైర్యంగా చెప్పగలుగుతారు, అన్ని పరిస్థితులలో సేవలో నిలువగలుగుతారు (2 పేతురు 1:10).

**సి. ఆమోసు పరిచర్య :** ఉత్తర రాజ్యపు రాజధానియైన బేతేలులోని రాజమందిరంలో ఆమోసు తన పరిచర్య కొనసాగించాడు. బేతేలు విజ్ఞాన కేంద్రం. అక్కడ ప్రవక్తల పాఠశాల కూడ ఉండినది. అంతమాత్రమే కాదు యరొబాము చేయించిన బంగారు దూడలు ఇక్కడే ప్రతిష్ఠించబడ్డాయి. పాలస్తీనలో గొప్ప భూకంపం రాకముందు, రెండు సంవత్సరాల క్రితం ఇతడు పరిచర్య చేసాడు. యూదా రాజైన ఉజ్జియా, దేవునిచేత మొత్తబడి కుష్ఠవ్యాధికి గురి అయినప్పుడు ఈ భూకంపం వచ్చిందని యూదుల చరిత్ర కారుడు జోషీఫస్ వ్రాసాడు (I ది.వృ. 26:16-21). ఆమోసు పరిచర్య చేసిన కాలంలో, II యరొబాము పరిపాలన విజయవంతంగా కొనసాగింది. (II రాజు 14:25).

డి. **ఆమోసు సందేశం :** ఆమోసుకు ఇవ్వబడిన సందేశం అసాధారణమైనది, ఇతర ప్రవక్తల సందేశాలకు భిన్నమైనది. అతని జీవిత శైలి, వస్త్రధారణ, మరియు సందేశం రాజమందిరంలోని వారికి సరిపడనివి. జీవితాన్ని గూర్చి, దేవుని ప్రణాళికను గూర్చి సార్వత్రిక దృక్పదం గలవాడు ఆమోసు. ప్రస్తుత కాలము గూర్చే కాక భవిష్యత్తును గూర్చిన విషయాలను కూడ ఎరిగి ఉన్నందువల్ల అతడు పేర్కొనదగిన వానిగా ఎంచబడ్డాడు. ఉత్తర రాజ్యం బహుగా వర్ధిల్లుతున్న సమయంలో దానికి రాబోయే శిక్షను గూర్చి ఆమోసు ప్రవచించాడు. నైతిక జీవితాన్ని భ్రష్టుపట్టించి, సుఖభోగాలతో తులతూగుతున్న రాజ్యాలపై దేవుని తీర్పు రానున్నదని ప్రకటించాడు. అలాగే తన ప్రజగా ఎన్నుకొన్న ఇశ్రాయేలుకు, తన సంకల్పాన్ని ప్రవక్తల ద్వారా తెలియజేసినా (3:7) వారు విననందు వల్ల తీవ్రంగా శిక్షిస్తాడని (4:12) ఆమోసు ప్రకటించాడు. ఆమోసు పాపాన్ని ఆక్షేపిస్తూ నిర్దయతో నిష్కపటంగా మాట్లాడాడు. ఆ కాలంనాటి అసత్య మతనాయకులను ప్రతిఘటించాడు. యాజకులకు గాని, రాజుకుగాని ఏ మాత్రం భయపడలేదు. తన సందేశాన్ని ధైర్యంగా చెప్పాడు. ఈనాడు కూడ దేవుడు అందరి నుండి అన్ని జాతులు మరియు అన్ని దేశాల నుండి సత్యం, నీతి, న్యాయం కోరుతున్నాడు. ఆమోసు కాలం నాటి పరిస్థితే నేటి సమాజాలలో కూడ ఉన్నది. పాపాన్ని ఎదుర్కోడానికి ప్రమాదాన్ని లెక్కచేయకుండ నిలవడానికి ఆమోసులాంటి ధైర్యం మనకు కావాలి.

ఇ. **ఆమోసు గ్రంథ రచన కాలం :** ఆమోసు ఇశ్రాయేలు రాజైన II యరొబాము, యూదారాజైన ఉజ్జియా కాలంలో, అనగా క్రీ.పూ. 779-743 మధ్య కాలంలో జీవించాడు. ఇతడు ఉత్తర రాజ్యపు ప్రవక్తలైన యోనా, హోషేయ మరియు దక్షిణ రాజ్యపు ప్రవక్తలైన యెషయా, మీకాలకు, సమకాలికుడు. ఈ గ్రంథంలో కనిపించే అభ్యుదయ స్థితిని బట్టి, ఈ గ్రంథం క్రీ.పూ. 760 సం॥లో వ్రాయబడి ఉండవచ్చును.

ఎఫ్. **ఆమోసు గ్రంథ మూలాంశం :** ఈ లోకానికి దేవుడే రాజని, రాజ్యాలన్ని, దేశాలన్నీ ఆయనకు బాధ్యులని ఆమోసు ముఖ్య సందేశం. ప్రతి దేశానికి ఇవ్వబడిన వెలుగు చొప్పున దాని బాధ్యత యొక్క పరిమాణం ఉంటుంది. ఆ పరిమాణము చొప్పుననే వారికి తీర్పు తీర్చబడుతుంది అన్నదే ఈ గ్రంథంలోని మూలాంశం.

## II. చారిత్రాత్మక నేపధ్యం :

ఆమోసుకు 40 సం॥లకు ముందు కాలంలో, సిరియా నుండి ఇశ్రాయేలు ఉత్తర ప్రాంతాల వరకు ఉన్న రాజ్యాలను అష్షూరీయులు అణచివేసారు. తత్ఫలితంగా లాభదాయకమైన వాణిజ్యం కొరకు మార్గాలు ఏర్పడడం వలన సమరయలో ధనిక వర్గం ఏర్పడింది. అందువల్ల ఆర్థిక అసమానతలకు దారి తీసి, పేద రైతాంగం నిరాదరణకు గురి అయ్యారు. ధనికులు పేదలను అణగద్రొక్కారు (2:6వ వచనం

నుండి). ధనికులలో స్వార్థం ఎక్కువైంది, డబ్బున్న వారికే న్యాయం జరిగింది (6:3-6). మతం భ్రష్టమైపోయింది. మతాచారాలు కొనసాగించబడినా, వాటిలో దేవునిపై నిర్లక్ష్యభావం, అవినీతి చోటు చేసుకొన్నాయి (4:4,5). ఈ ఆచారాలు పేదలకు ప్రాణాంతకంగా మారాయి (2:8). ఈ మతాచార దుర్వినియోగాన్ని ఆమోసు తీవ్రంగా ఖండించాడు. అవి దేవునికి అంగీకారం కాదు (5:21-24). ఆయన కోరినదానిని నెరవేర్చలేవు. అందువల్ల దేవుడు బలిపీఠము వద్ద నిలిచి దాన్ని ధ్వంసం చేయడానికి సిద్ధముగా ఉన్నాడు (9:1).

## III. గ్రంథ విభజన :

### ఎ. పొరుగు దేశాలపై రానున్న తీర్పు (1:1-2:3)

1. ఉపోద్ఘాతం (1:1,2)
2. సిరియా దేశంపై రానున్న తీర్పు (1:3-5)
3. ఫిలిష్తియ దేశంపై రానున్న తీర్పు (1:6-8)
4. ఫెనికయ దేశంపై రానున్న తీర్పు (1:9,10)
5. ఎదోము దేశంపై రానున్న తీర్పు (1:11,12)
6. అమ్మోను దేశంపై రానున్న తీర్పు (1:13-15)
7. మోయాబు దేశంపై రానున్న తీర్పు (2:1-3)

### బి. యూదా మరియు ఇశ్రాయేలు దేశాలపై రానున్న తీర్పు (2:4-6:14)

1. యూదా పై రానున్న తీర్పు (2:4,5)
2. ఇశ్రాయేలుపై రానున్న తీర్పు (2:6-16)
3. ఇశ్రాయేలు కుటుంబమంతటిని గూర్చి దేవుని చర్య (3 అధ్యా)
4. ఇశ్రాయేలు దోషమును బట్టి గతంలో వచ్చిన శిక్ష (4 అధ్యా)
5. ఇశ్రాయేలు దోషమును బట్టి భవిష్యత్తులో శిక్షించబడుతుంది. (5 అధ్యా)
6. ఇశ్రాయేలు దోషమును విడచిపెట్టడానికి ప్రస్తుతం గద్దించబడుట (6 అధ్యా)

### సి. భవిష్యత్తును గూర్చిన దర్శనాలు (7-9 అధ్యా)

1. మిడుతలను గూర్చిన దర్శనం (7:1-3)
2. అగ్నిని గూర్చిన దర్శనం (7:4-6)
3. మట్టపు గుండును గూర్చిన దర్శనం (7:7-9)
4. దర్శనాల మధ్య విరామం - ప్రవక్త వ్యక్తిగత అనుభవం (7:10-17)

5. వేసవి కాలపు పండ్ల గంపను గూర్చిన దర్శనం (8 అధ్యా)

6. ఇశ్రాయేలు లోకమంతట చెదరి పోవుటను గూర్చిన దర్శనం (9:1-10)

7. ఇశ్రాయేలు లోకమంతటి నుండి సమకూర్చబడుట మరియు పునరుద్ధరించబడిన రాజ్యమును గూర్చిన దర్శనం (9:11-15)

## IV. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### ఎ. పొరుగు దేశాలపై రానున్న దేవుని తీర్పు :

ఆమోసు, తన కాలంలో, ఇశ్రాయేలుకు ఇరుగు పొరుగున నున్న బలమైన దేశాలను గూర్చి మొదట ప్రవచించాడు. అన్యదేశాలపై రానున్న ఈ తీర్పు, దేవుడు ఇశ్రాయేలీయులకు మాత్రమే కాదు, అన్యులకు కూడ దేవుడు అని నిరూపిస్తున్నది. క్రొత్త నిబంధనలో, పౌలు కూడ దీన్ని స్పష్టం చేసాడు. దేవుడు నాడు ఇశ్రాయేలును ఈనాడు విశ్వాసులను ఎన్నుకొన్నాడంటే అర్థం, మిగతా జాతులను వదిలేసాడని కాదు. ఆమోసులాగే యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు, దానియేలు కూడ అన్యదేశాలపై రానున్న తీర్పును గూర్చి ప్రకటించారు. కాని వారు మొదట ఇశ్రాయేలును గూర్చి, తరువాత ఇతర రాజ్యాలను గూర్చి చెప్పారు. ఆమోసు అందుకు భిన్నంగా మొదట అన్యరాజ్యాలను గూర్చి చెప్పాడు. వారిని గూర్చి చెప్పగానే రాజభవనమంతా ప్రజలతో నిండిపోయింది. అందరూ సమకూడాక ఇశ్రాయేలీయుల స్వకీయ పాపము గూర్చి, అందుకు రానున్న తీర్పును గూర్చి చెప్పాడు.

పొరుగు దేశాలను గూర్చి చెప్తున్నప్పుడు, ప్రతి దేశం యొక్క ముఖ్య పట్టణంపై తీర్పు ప్రకటించడం గమనార్హం. వారి పాపమును గూర్చి, మూడు సార్లు, నాలుగు సార్లు, చేసిన దోషము అని చెప్పడంలో దేవుని దీర్ఘశాంతం కనిపిస్తుంది. దేవుడు మన దోషాలని లెక్కించాలంటే విస్తారంగా ఉంటాయి. కాని ఆయన ముఖ్యమైన వాటినే గణిస్తాడని ఈ దేశాలపై మోపబడిన ప్రత్యేక నేరాలను బట్టి తెలుస్తుంది. ప్రతి దేశం శిక్షించబడడానికి ప్రత్యేక పాపమే కారణం.

1. **దమస్కుపై రానున్న తీర్పు (1:1-5)** : దమస్కు సిరియా దేశానికి ముఖ్యపట్టణం. వారు ఇశ్రాయేలీయులను బహుగా బాధించారు. వారు పంటదుళ్ళగొట్టే పనిముట్లు చాల పదునైనవి. ముఖ్యంగా బెన్హదదు మరియు హజాయేలు కాలంలో ఇశ్రాయేలీయులను కౄరంగా హింసించారు (**II** రాజు 6:24; 8:11-13; 13:22). హజాయేలు తన యజమానిని అనగా సిరియా రాజైన బెన్హదదును చంపి అతనికి మారుగా రాజు అయ్యాడు (**II** రాజు 8:15). అతడు ఇశ్రాయేలు సరిహద్దులలో నున్న, యొర్దాను తూర్పు దిక్కున గాదీయులకు రూబేనీయులకు చేరికైన గిలాదు దేశమును, అర్నోను నది దగ్గరనున్న అరోయేరు మొదలుకొని మనష్షీయుల దేశమును, అనగా గిలాదు మరియు బాషానులోని వారిని ఓడించాడు (**II** రాజు 10:32,33). యూదా రాజైన యోవాషు కాలంలో హజాయేలు

గాతుపట్టణాన్ని పట్టుకొని, తరువాత యెరూషలేము పైకి రావాలనుకొన్నప్పుడు యోవాషు రాజనగరులోను, యెహోవా మందిరంలోను ఉన్న బంగారు వస్తువులన్నిటిని అతనికి కప్పముగా పంపించాడు (**II** రాజు 12:17,18).

సిరియా చేసిన ఈ పాపమును బట్టి దాని నగరులు కాల్చివేయబడ్డాయి. దాని రాజధానియైన దమస్కు అడ్డగడియలు విరచివేయబడ్డాయి. దాని ప్రజలు అష్షూరు దేశంలోని కీరు పట్టణానికి చెరగా తీసికొని పోబడ్డారు (**II** రాజు 16:9).

2. **గాజాపై రానున్న తీర్పు (1:6-8) :** గాజా ఫిలిష్తీయ దేశానికి రాజదాని, ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులను పట్టుకొనిపోయి (**II** ది.వృ. 21:16, 17) ఎదోమీయులకు మరియు ఫెనికెయులకు అమ్మివేసారు. ఫెనికెయులు వ్యాపారస్తులు గనుక తాముకొనిన ఇశ్రాయేలీయులను మధ్యధరా ప్రాంతాలన్నిటిలో బానిసలుగా అమ్మివేసారు. (యోవే 3:4-8). ఇందును బట్టి దేవుడు గాజా, అష్డోదు, అష్కెలోను మరియు ఎక్రోను అనే ఫిలిష్తీయుల నాలుగు ముఖ్యపట్టణాలను శిక్షించాడు. దేవుడు చెప్పిన విధంగానే ఈ ప్రాంతాలకు తీర్పు తీర్చబడింది (**II** రాజు 18:8). భవిష్యత్తులో కూడ దేవుడు తన ప్రవచనాలను తప్పకుండా నెరవేరుస్తాడు. ప్రస్తుతం గాజా అరబ్ ప్రాంతంలో ఇశ్రాయేలీయుల ఆధీనంలో ఉన్నది. ఇశ్రాయేలుకు ఈ ప్రాంతాన్ని గూర్చిన సమస్య ఉన్నది. అష్డోదు మరియు అష్కెలోను ఇంకా ఇశ్రాయేలులోనే ఉన్నాయి. అష్డోదులో సంసోను పడగొట్టిన దాగోను గుడి శిథిలాలు ఇంకా ఉన్నాయి (న్యాయా 16:29,30).

3. **తూరు మీదికి రానున్న తీర్పు (1:9,10) :** తూరు, మధ్యధరా సముద్ర తూర్పు తీరాన ఉన్న ఫెనికెయ దేశంలో ఉన్నది. తూరు రాజైన హీరాము దావీదుకు మంచి స్నేహితుడు (**II** సమూ 5:11; **I** రాజు 5:1) ఇశ్రాయేలు మరియు యూదా రాజులెవరేగాని ఫెనికెయపై యుద్ధం చేయలేదు. ఫెనికెయులు దావీదు మరియు సొలొమోను కాలంలో ఇశ్రాయేలీయులతో సహోదర నిబంధన చేసికొన్నారు (**I** రాజు 5:12,18; 9:27,28). అయితే తరువాతి కాలంలో వారు ఈ నిబంధనను జ్ఞాపకం చేసికొనక, ఫిలిష్తీయులచేత వీరికి అమ్మబడిన ఇశ్రాయేలీయులను ఎదోమీయులకు అప్పగించారు (యెషయా 3:4-6). వారు చేసిన దానిని బట్టి దేవుడు తూరును శిక్షించాడు. మొదట తూరు మీదికి అష్షూరీయులు, తరువాత నెబుకద్నెజరు దండెత్తారు. ఈ నగరాన్ని అతడు నాశనం చేసి, ప్రజలను సముద్రానికి అరమైలు దూరంలో ఉన్న ద్వీపానికి తరలించాడు. వారు అక్కడ క్రొత్త పట్టణాన్ని కట్టుకొన్నారు. అటు పిమ్మట 250 సం॥ల అనంతరం అలెగ్జాండర్ మహా చక్రవర్తి అభివృద్ధి చెందుతున్న ఈ దేశానికి రహదారిని నిర్మించిన సందర్భంలో తూరు పట్టణాన్ని పూర్తిగా నాశనం చేసాడు. అలా దానికి శిక్ష విధించబడింది (యెహె 26:15-19; ఆమో 1:10).

4. **ఎదోము మీదికి రానున్న తీర్పు (1:11,12) :** ఏదోమీయులు ఏశావు సంతానం, ఇశ్రాయేలీయులు యాకోబు సంతానం. ఉభయులకు దగ్గర సంబంధం ఉన్నా, ఇశ్రాయేలీయులు ఎదోమీయుల చేతుల్లో బహుగా హింసించబడ్డారు (ఓబద్యా 1:10-14).

అందుకు కారణం తమ సహోదరులపైన ఉన్న అసూయనే. వారిలో ఉన్న ఈ ప్రతీకార స్వభావాన్ని బట్టి దాని ముఖ్య పట్టణాలైన తేమాను మరియు బోస్రామీదికి దేవుని తీర్పు వచ్చింది. తేమాను పర్వత ప్రాంతం (ఓబద్యా 1:9) వారి నెవరూ క్రిందికి త్రోసివేయలేరన్న గర్వం వారికుండినది (ఓబ 1:3,4). కాని దేవుని నిత్య కోపాగ్నికి గుర్తైంది (ఓబ. 1:10; మలా. 1:2-4). మరెన్నటికి కట్టబడకుండ నాశనమైంది.

5. **అమ్మోను మీదికి రానున్న తీర్పు (1:13-15) :** అమ్మోను యొర్దాను తూర్పు ఒడ్డున ఉన్నది. వీరు తమ సరిహద్దులను విశాల పరచుకొనేందుకు, సిరియనులతో కలసి గిలాదు ప్రాంతంలోని ఇశ్రాయేలు 2 1/2 గోత్రాలతో యుద్ధం చేసారు. అప్పుడు సిరియనుడైన హజాయేలుతో కలిసి గిలాదులోని గర్భిణి స్త్రీల కడుపులను చీల్చారు. ఈ విషయాన్ని గూర్చి ఎలీషా ముందుగానే ప్రవచించాడు (**II** రాజు 8:12). వారి హింసాత్మక చర్యలను బట్టి, అమ్మోను ముఖ్యపట్టణమైన రబ్బా అష్షూరీయులచే నాశనం చేయబడింది (యిర్మీ 49:1-6; యెహె 25:1-7; జెఫ 2:8,9). తరువాత క్రీ.పూ. 285-246లో ఐగుప్తీయుడైన టాలమీ ఫిలడెల్ఫస్ దాన్ని తిరిగి కట్టించి ఫిలడెల్ఫియా అని నామకరణం చేసాడు. అదే నేటి, జోర్డాన్ రాజ్యానికి రాజధానియైన అమ్మాన్.

6. **మోయాబు మీదికి రానున్న తీర్పు (2:1-3) :** వీరు దావీదు తరువాత, యూదా రాజులపై తిరుగబడి స్వతంత్ర్య రాజ్యముగా ఏర్పడ్డారు. మోయాబీయులు ఎదోమురాజును జయించి, అతన్ని చంపారు. అంతటితో వారి పగతీరలేదు. అతని ఎముకలను కాల్చి సున్నం చేసారు. సమాధులను త్రవ్వి తీసి అగౌరవపర్చారు. కనుక దేవుడు వారి బలాధారాలను కాల్చివేసాడు. వారి అధిపతులందరిని సంహరించాడు. నెబకద్నెజరు, మోయాబును నామరూపాలు లేకుండా చేసాడు. కెరియోతు బహుశా "కీర్హరెశెతు" అనే పట్టణం కావచ్చును.

## బి. యూదా మరియు ఇశ్రాయేలుపై రానున్న తీర్పు (2:4-16)

1. **యూదాపై రానున్న తీర్పు (1:4,5) :** యూదా, దేవుని ధర్మశాస్త్రాన్ని విసర్జించినది, మరియు ఆయన ఆజ్ఞలకు లోబడలేదు. ధర్మాశాస్త్రము యూదులకు ఒక ఆధిక్యతగా ఉండినది (రోమా 9:4). యూదాలో, ముఖ్యపట్టణమైన యెరూషలేములోని దేవాలయం కూడ వారికి ఒక ఆధిక్యతగా ఉన్నది. ఆ ఆధిక్యతలను నిర్లక్ష్యం చేసినందువల్ల నెబుకద్నెజరు యెరూషలేము దేవాలయంలోని సామాగ్రినంతా బబులోనుకు తీసికొని వెళ్ళాడు. పట్టణాన్ని కాల్చివేసాడు (**II** రాజు 25:13-17; **II** ది.వృ. 36:18-20).

2. **ఇశ్రాయేలుపై రానున్న తీర్పు 2:6-16 :** ఆమోసు, దేవుడు ఇశ్రాయేలును గూర్చి సెలవిచ్చిన ఈ మాటలను ఆ రాజ్యంలోని రాజ భవనంలో నుండే ప్రకటించాడు. యూదా మరియు ఇశ్రాయేలు రాజ్యాలు శత్రువులుగానే ఉన్నారు. ఆమోసు యూదాపై రానున్న తీర్పును గూర్చి చెప్తున్నప్పుడు, ఉత్తర రాజ్యంలోని ఇశ్రాయేలీయులు సంతోషించి ఉండవచ్చును. ఎందుచేతనంటె, ఆ సమయంలో ఉత్తర రాజ్యంలోని 10 గోత్రాలవారు,

దక్షిణ రాజ్యంలోని రెండు గోత్రాలవారితో యుద్ధానికి సిద్ధమౌతున్నారు. అయితే ఇప్పుడు వారిపైకి రానున్న తీర్పును గూర్చి ఆమోసు చెప్పడం ప్రారంభించాడు. యూదా ధర్మశాస్త్రాన్ని విసర్జించింది, కాని ఇశ్రాయేలు ధర్మశాస్త్రానికి విరోధంగా పాపం చేసింది. పేదలకు అన్యాయం చేయడం (2:6,7ఎ), వ్యభిచారం (2:7), దరిద్రులకు అన్యాయం చేయడం (2:7; ద్వితీ. 16:19), వారు తాకట్టుపెట్టిన వస్త్రాలను దేవుని మందిరములో పరచుకొని పడుకోవడం (2:8; ద్వితీ 24:12,13), త్రాగుబోతుతనం (2:8) మొదలైన పాపాలు చేయడమేగాక, దేవుని కొరకు ప్రతిష్ఠించబడిన నాజీరులకు ద్రాక్షారసం త్రాగించడం ద్వారా (2:11; సంఖ్యా 6:1-4), ప్రవక్తలను ప్రవచించవద్దని (అనగా దేవుని మాటలు చెప్పవద్దని) ఆజ్ఞాపించడం ద్వారా దేవుణ్ణి అగౌరవపర్చారు. వీరు గతంలో దేవుని దీవెనలు పొంది కూడ కృతఘ్నులుగా ఉన్నారు. (2:9,10) పైగా ఏ క్రియలను బట్టి ఆమోరీయులు శిక్షించబడ్డారో ఆ క్రియలనే వీరు చేసారు. అందుకే వారిపైకి తీర్పు వచ్చింది.

3. **యాకోబు కుటుంబము వారందరిని గూర్చిన దేవుని తీర్పు 1-6:14 :** ఇశ్రాయేలు జాతి రెండు రాజ్యాలుగా విభాగించబడినా ప్రవక్త అందరినీ ఒకే కుటుంబముగా కలిపి చెప్తున్నాడు, గతంలో వీరికి ఎన్నో ఆధిక్యతలు ఇవ్వబడ్డాయి (3:2) దేవుడు ప్రేమతో ఇచ్చిన ఆధిక్యతలను బట్టి బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన వీరు దేవుని ప్రేమను తృణీకరించారు ఇక మిగిలింది శిక్షనే. 3వ అధ్యాయంలో ఆమోసు తన అనుభవంలో నుండి 7 హేతుబద్ధమైన ప్రశ్నలు వేసాడు (3:3-6). ఈ లోకంలో సమస్తం దేవుని వలననే జరుగుతాయని, యాదృచ్ఛికంగా జరగవని, దేవుడు చేసే ప్రతి దానికి కారణం మరియు ప్రతిఫలం ఉంటుందని, అయితే దేవుడు తాను సంకల్పించిన దానిని తన ప్రవక్తలకు బయలుపరచకుండ ఏమి చేయడని ఆమోసు స్పష్టం చేసాడు (3:7,8). యాకోబుకు ఇవ్వబడిన ఆధిక్యతలకు సమానమైన శిక్షను వారు పొందాలి. వారి శిక్ష మూడు విధాలుగా వివరించబడింది.

అ. **ఇశ్రాయేలు తన దోషమును బట్టి గతంలో శిక్షించబడింది (4వ అధ్యా) :** దేవుడు తన ప్రజలను సరైన స్థితికి తీసికొనిరావడానికి అన్ని ప్రయత్నాలు చేసాడు (4:6-13). కాని వారు నిరాకరించారు. కనుక గతంలో వారికి రక్షకునిగా ఉన్నవాడే తీర్పరిగా మారాడు (4:12). ఈ అధ్యాయం ప్రారంభంలో ప్రస్తావించబడిన బాషాను ఆవులారా! అన్నమాట సుఖభోగులైన ఇశ్రాయేలు స్త్రీలనుద్దేశించి చెప్పబడిందన్న అభిప్రాయం ఉన్నది. వీరు దరిద్రులను బీదలను బాధపెడుతూ, మాకు కావలసినవన్నీ ఇవ్వమని తమ యజమానులను (భర్తలను) వత్తిడి చేసారు (4:1). ఇశ్రాయేలీయుల నిష్ఫల, నిర్జీవ మతాచారాలు దేవుని పరిశుద్ధతకు అవమానాన్నే కలిగించాయి (4:4,5). ప్రజలు జీవముగల దేవుని నుండి పూర్తిగా తొలగిపోయారు గనుక, వారు దేవుని సన్నిధిలో తీర్పుకై సిద్ధపడాలి (4:12). వారి క్రియలను బట్టి తీర్పు తీర్చబడుతుంది. అలాగే ప్రతి విశ్వాసి కూడ ఒక దినాన క్రీస్తు న్యాయ పీఠం ఎదుట నిలువబడాలన్నది జ్ఞాపకం ఉంచుకోవాలి. జాగ్రత్త గలిగి జీవించాలి (**II** కొరి 5:10). నాల్గవ అధ్యాయం చివరలో

ఆమోసు దేవుణ్ణి సర్వశక్తునిగా, సర్వజ్ఞునిగా, సర్వవ్యాపిగా చూపిస్తున్నాడు (4:13).

ఆ. **ఇశ్రాయేలు తన దోషమును బట్టి భవిష్యత్తులో శిక్షనొందుట (5వ అధ్యా) :** దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన తుది పిలుపును గూర్చి 5:1–4 లో వివరించబడింది. నాల్గవ అధ్యాయంలో దేవుడు తన ద్వారాన్ని మూసివేసినట్లు, ఇక శిక్ష తప్పదు అన్నట్లు కనిపిస్తుంది. 5వ అధ్యాంలో వారిని భవిష్యత్తులో శిక్షిస్తానని చెప్పినప్పటికి, వారు ఆ శిక్షను తప్పించుకోడానికి తనవైపు తిరగాలని బతిమిలాడుతున్నాడు. బేతేలును, గిల్గాలును, బేయెర్షెబాను ఆశ్రయిస్తే ఫలితం శూన్యమని వాపోయాడు. కాని వారు ఆయన పిలుపును నిరాకరించినందువల్ల తీర్పు రాబోతుంది. 90 శాతం సైనికులు యుద్ధంలో చనిపోతారు (5:3). ఇశ్రాయేలీయుల అర్పణలను దేవుడు అసహ్యించుకొన్నాడు (5:21–23). ఆయన వారి నుండి నీతినే కోరాడు (5:24). అది వారిలో కొరవడినందువల్ల వారిని చెరకు పంపించాల్సివచ్చింది (5:27). అంతమాత్రమే కాదు యెహోవా దినము వారికి శ్రమ దినముగా ఉంటుంది. ఒక దానిని తప్పించుకొంటే మరొకదాని చేత నాశనం చేయబడతారు (5:18–20).

ఇ. **ఇశ్రాయేలు దోషాన్ని బట్టి ప్రస్తుతం శిక్షనొందుట (6వ అధ్యా) :** ఈ అధ్యాయం మొదటి వచనంలోనే రెండు ప్రధాన పట్టణాలు పేర్కొనబడ్డాయి. సీయోను యూదుల ఆరాధనా కేంద్రం. షోమ్రోను భద్రతను సూచిస్తున్నది. ఉత్తర రాజ్యంలోని షోమ్రోను కొండమీద, ఈ పట్టణం కట్టబడింది (I రాజు 16:24). ఈ పర్వతాలు తమకు శత్రువుల నుండి భద్రతనిస్తాయన్న నిర్భయం వారిలో ఉండినది. ఈ భాగంలో ఇశ్రాయేలు జాతీయ పాపాలు పేర్కొనబడ్డాయి. ఏ దేశమైనా, కుటుంబమైనా, సమాజమైనా నాశనం కావడానికి ఈ మూడు పాపాలే కారణమౌతాయి.

1. తిండిబోతు తనం మరియు లైంగిక పాపం (6:4)
2. ఆధ్యాత్మికతలేని సంగీతం (6:5)
3. మద్యపానాసక్తి (6:6)

ఇవన్నీ మానవుని హృదయ స్థితిని సూచిస్తున్నాయి. వీటితో మనుష్యులు తమ హృదయాలను నింపుకోడానికి ప్రయత్నిస్తున్నారు. కాని వారి హృదయలోటును దేవుడొక్కడే పూరించగలడు. దేవునికి తమ హృదయాలలో చోటిచ్చినపుడే మానవుల ఆత్మలు తృప్తినొందుతాయి.

ఇశ్రాయేలు చేసిన ఈ మూడు పాపాలు దాని నాశనానికి కారణమయ్యాయి. అవే పాపాలు యూదాను నాశనం చేసాయి. బబులోను, ఐగుప్తు, గ్రీసు, మరియు రోమా సామ్రాజ్యాల పతనానికి కూడ ఈ పాపాలే కారణం. ఇశ్రాయేలు శిక్ష ఎంత తీవ్రమైందో 6:8–14 లో వ్రాయబడింది. అందులో గొప్ప కుటుంబాలు, చిన్న కుటుంబాలు కూడ ఉన్నాయి. అందరికీ తీర్పు ఉన్నది. సాధారణంగా మృతులను పాతిపెట్టడమే

వాక్యానుసారమైన పద్ధతి (ఆది 3:19). తప్పని సరియైన పరిస్థితిలో యాబెష్గిలాదువారు, సౌలు కుటుంబికుల మృతదేహాలను, ఫిలిష్తీయులు అగౌరవపరచకూడదన్న ఉద్దేశంతో కాల్చివేసారు (I సమూ 31:12). అయితే ఆమోసు 6:10లో, మృతులను కాల్చడానికి కారణం, మృతుల సంఖ్య అధికమవడం, పాతి పెట్టేవారు లేనందువల్లనేనని గ్రహించాలి.

ఒకవేళ కుటుంబంలో చావకుండ మిగిలినవారెవరైనా ఉంటే వారు ఏమి మాట్లాడకూడదు, యెహోవా నామమును స్మరించకూడదని అజ్ఞాపించబడ్డారు. తన కుటుంబస్తులు చనిపోయినందుకు యెహోవాను తిట్టుకోవద్దు లేక, తాను బ్రతికి ఉన్నందుకు స్తుతించవద్దు. ఎంత ఘోరమైన స్థితో ఆలోచించాలి.

ఈ సందర్భంగా ఒక సత్యాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. ఈనాడు కూడ, అతిగా భుజించడం, మితిమీరిన త్రాగుడు, వ్యభిచారం, ఆధ్యాత్మికతలేని కాలక్షేపాలు వ్యక్తిగత జీవితాలను నాశనం చెయ్యడమే కాక, వారి కుటుంబాలను కూడ నాశనం చేస్తున్నాయి. ఈ పాపాలను బట్టి అనేకులు తమ కుటుంబస్తుల ప్రేమను కోల్పోతున్నారు. ఒంటరిగా మిగిలి పోతున్నారు. వారి కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నాయి.

## III. భవిష్యత్తును గూర్చిన దర్శనాలు 7-9 అధ్యా :

ఆమోసు వ్యక్తిగతంగా సామాన్యుడేగాని, అతడు చూచిన దర్శనాలు గుర్తించదగినవి.

1. **మిడుతల దర్శనం (7:1-3) :** ఈ దర్శనంలో మిడుతలు, రాజునకు రావలసిన కోత అయిన తరువాత మొలచిన కడవరి గడ్డినంతా తినివేసినట్లున్నది. ఇశ్రాయేలు దేశంలో సాధారణంగా రెండు పంటలు పండిస్తారు. మొదటి పంటలో పదింటిలో మూడవ భాగం అనగా 30% రాజుకు పన్నుగా చెల్లించాలి. రెండవ పంటలో ఏమి మిగులకుండ మిడుతలు తినివేసాయి. ఇశ్రాయేలును ఆ విధంగా శిక్షించవద్దని ఆమోసు చేసిన మనవిని దేవుడు విన్నాడు. అలా జరుగనివ్వనని హామి ఇచ్చాడు (7:3).

2. **అగ్నిని గూర్చిన దర్శనం (7:4-6) :** ఇది కరవును సూచిస్తుందని కొందరి అభిప్రాయం కరవుకు అగ్నికి సంబంధం ఉంది. కరవు సమయంలో పచ్చిక, చెట్లు ఎండిపోయినపుడు, కొండలపై రాపిడి వలన అగ్ని రగులుకోవడం సహజంగా జరిగే విషయం. అయితే ఇక్కడ ఆమోసు, అగ్ని పాలస్తీనలోని జలాలను ఆవిరిగా మార్చివేసినట్లు చూసాడు. కనుక గొప్ప నీటి కొరతను ఇది సూచిస్తున్నది. ఆమోసు ఈ శిక్షను కూడ రానివ్వ వద్దని మనవిచేసాడు (7:6).

3. **మట్టపు గుండును గూర్చిన దర్శనం (7:7-9) :** మట్టపు గుండు వక్రతను పరిశీలించడానికి, సరిచేయడానికి ఉపయోగించబడుతుంది. బైబిలులో మట్టపు గుండు, లేక కొలనూలును గూర్చి ప్రస్తావించబడినపుడెల్లా (యెష 28:17; యిర్మీ 31:38; జెక. 2:1,2); మరియు కొలత, లేక బరువు చూచినపుడెల్లా దేవుడు తీర్పుకు సిద్ధమైనట్లున్నది. దేవుడు కోరినస్థాయిలో లేనివారికి తీర్పు తీర్చబడింది (దాని 5:27).

ఆమోసు చూసిన దర్శనంలో, దేవుడు పరలోకపు న్యాయం అనే మట్టపు గుండుతో ఇశ్రాయేలును పరీక్షిస్తున్నాడని, వారిని శిక్షించక మానడని, **II** యరొబాము కుటుంబం నాశనమౌతుందని, బయలు పర్చబడింది. అక్షరాల అలాగే జరిగింది (**II** రాజు 15:8-12). ఇదే మట్టపు గుండు మనష్షేకాలంలో యూదాపై కూడ ఉపయోగించ బడింది. (**II** రాజు 21:13-15).

4. **దర్శనాల మధ్య చారిత్రాత్మక సంఘటన మరియు ఆమోసు వ్యక్తిగత నేపథ్యం (7:10-17) :** ఈ భాగంలో యరొబాము బేతేలులో నిలబెట్టిన బంగారు దూడలకు యాజకునిగా ఉన్న అమజ్యా, ఆమోసును గూర్చి రాజుతో అబద్దాలు చెప్పి అతనిపై ఫిర్యాదు చేయడం, మరియు ఆమోసును యూదాకు తిరిగి వెళ్ళమని ఆజ్ఞాపించడం, ఈ సందర్భంగా ఆమోసు తన వ్యక్తిగత పిలుపును గూర్చి మరియు అమజ్యాకు రానున్న శిక్షను గూర్చి చెప్పడం జరిగింది. అమజ్యా (7:9) ఆమోసు చెప్పిన ప్రవచనాన్ని మార్చి చెప్పాడు (7:11). ఈ దినాల్లోను, సంఘంలో చెప్పబడిన వాక్యానికి ఉన్నవీ లేనివి కలిపి చెప్పి ఇతరులను రెచ్చగొట్టేవారున్నారు. సేవకులపై చాడీలు చెప్పడం, సేవకులకు ఆజ్ఞలివ్వడమే వీరి పని.

ఆమోసు తనంతట తానే బేతేలుకు రాలేదని, తాను ప్రవక్తకాదని, ప్రవచించాలన్న ఆశ అంతకన్నా లేదు గాని దేవుడే తనను అందుకై పిలిచి, అక్కడికి పంపించాడని ఖచ్చితంగా చెప్పాడు. దేవుని పిలుపును గూర్చిన నిశ్చయత ఆమోసుకు ఉన్నది గనుక తనను ఎదిరించిన అమజ్యాను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అంతమాత్రమే కాదు దేవుని ప్రవక్తను ఎదిరించినందుకు అతడు శిక్షించబడతాడని చెప్పాడు (7:17). ఈ ప్రవచనం అష్షూరీయులు దాడి చేసినపుడు అక్షరాల నెరవేరింది.

3. **వేసవికాలపు పండ్లగంప దర్శనం (8 అధ్యా) :** వేసవి కాలపు పండ్లు ఆ సంవత్సరపు చివరి కోతను సూచిస్తున్నవి. కనుక ఈ పండ్లగంప ఇశ్రాయేలుకు అంతము వచ్చిందని తెలియజేస్తుంది. పండినపళ్ళు కోతకు సిద్ధంగా ఉన్నట్లు ఇశ్రాయేలు పాపం పండి, తీర్పుకు సిద్ధంగా ఉన్నది. అందుకు కారణం, బీదవారిని దోచుకోవడం, వ్యాపారంలో మోసం, బానిసలను కొనుక్కోవడం, సబ్బాతును అగౌరవపర్చడం, వారమంతా మోసంతో వ్యాపారం చెయ్యడమే కాకుండ, విశ్రాంతి దినాన మందిరానికి వెళ్ళినా దేవుని ఆరాధించడానికి బదులు ఈ దినం ఎప్పుడు గడుస్తుందా మళ్ళీ ప్రజల్ని ఎలా మోసం చెయ్యాలి అన్న తలంపులతోనే గడిపేవారు. కనుక తీర్పు మందిరంలోనే ప్రారంభమౌతుంది (8:3,8). ఈ తీర్పులో భూమ్యాకాశాల ప్రమేయం కూడ ఉన్నది (8:8-10) దేవుడు ఆశీర్వాదాలను వాగ్ధానం చేసినా, లేక తీర్పును ప్రకటించినా అందులో దేశం (భూమి) మరియు ప్రజలు కూడ తప్పకుండా ఉంటారు (ఆమో 9:5). దేశం దీవించబడినా, తీర్పు పాలైనా అందుకు కారణం ప్రజలే. ప్రస్తుతం ఇశ్రాయేలీయులు భౌతికంగా తిరిగి వచ్చినా, ఆత్మీయంగా తిరిగి రాలేదు. కనుక వారి దేశంపై దేవుని దీవెన లేదు. 8:11-14 లో అంత్య దినాలలో దేవుని వాక్యపు కరవును

గూర్చి వ్రాయబడింది. దేవుని వాక్యం శ్రమలలో ఆదరిస్తుంది, బలపరుస్తుంది. అయితే ఇశ్రాయేలు శ్రమకులోనైనపుడు వారిని ఆదరించడానికి ఆ మాటలుండవు. వారు వాక్యం కొరకు వెదకుతారు. ఈ భాగంలో ఆమోసు కొంత కాలానికి రాబోయే శిక్షను మరియు అంత్య కాలంలో కలుగబోయే మహాశ్రమల కాలాన్ని గూర్చి కూడ చెప్పాడన్నది గమనార్హం.

6. **ఇశ్రాయేలు లోకమంతట చెదరిపోవుటను గూర్చిన దర్శనం (9:1-10) :** ఈ భాగంలో ఇశ్రాయేలు పాపాలు ఖండించబడ్డాయి. యెహోవా నిలిచిన ఈ బలిపీఠము బహుశా షోమ్రోనులోని బలిపీఠం కావచ్చు. ఎవరూ తప్పించుకోలేంత శిక్ష వారిపైకి రాబోతుంది. ఒకవేళ తప్పించుకొన్నా, తప్పించుకోడానికి వారు ఆశ్రయించిన మందిరాలే వారిపై కూలిపోయి వారిని నాశనం చేస్తాయి (9:1). దేవుడు సర్వవ్యాపి (9:2-4) గనుక వారు ఎక్కడికి పారిపోయినా, తప్పించుకోలేరు. ఇశ్రాయేలీయులను లోకమంతటా చెదరగొడతాడు కాని ఆ జాతి నాశనం కాదు (9:9) అయితే వారిలో పాపాత్ములైనవారు చస్తారు (9:10).

7. **లోకమంతటి నుండి ఇశ్రాయేలు తిరిగి సమకూర్చబడుట (9:11-15) :** ఐక్యరాజ్యం పతనమైన తరువాత ఉత్తర రాజ్యంలోని 10 గోత్రాలు దేవుని మందిరాన్ని అగౌరవపర్చాయి. అయితే వేయ్యేండ్ల పాలనలో అది మరల కట్టబడుతుంది. ఈ విషయాన్ని గూర్చి ఆదిమ సంఘ పెద్దలలో ఒకడైన యాకోబు కూడ జ్ఞాపకం చేసాడు (అపొ. 15:14-17). పునర్నిర్మించబడిన ఐక్యరాజ్యంలో 12 గోత్రాలు ఉంటాయి. దావీదు చిగురు అయిన క్రీస్తు ఆ రాజ్యన్ని పరిపాలిస్తాడు. ఇశ్రాయేలీయులు సర్వ సమృద్ధిగలవారై ఆ దేశంలో స్థిరపర్చబడతారు. వారు అన్యజనులందరిని స్వతంత్రించుకొంటారు (9:11).

**ఆమోసు గ్రంథం నుండి నేర్చుకొనదగిన మూలపాఠాలు.**

1. మనుష్యులందరు వారి పాపాన్ని గూర్చి ఉత్తరవాదులు దేవుణ్ణి తృణీకరించే వారు వర్ధిల్లినపుడు బాధ పడవద్దు లేక అసూయ పడవద్దు. మనం ఎలా జీవించామన్నదే ముఖ్యం.
2. మనము పొందిన ఆశీర్వాదాలను బట్టి మనల్ని మనం ఘనపరచుకోవద్దు. అవన్నీ దేవుని నుండి కలిగినవే. దేవుని కంటె ఎక్కువగా నిన్ను బట్టి నీవే సంతృప్తి చెందడం అర్థరహితం. దేవుడు లేకుండ ఎన్ని కలిగి ఉన్నా అన్నీ వ్యర్థం.
3. మనుష్యులందర్నీ దేవుడే సృష్టించాడు. కాబట్టి పేదవారిని తృణీకరించడం, వారి కోసం ప్రాణం పెట్టిన క్రీస్తును తృణీకరించడం అన్నమాట. వారి పట్ల దయ గలిగి, వారు ఎదుర్కొంటున్న అన్యాయాన్ని మనం అరికట్టాలి. వారికి సహాయం చేయాలి.
4. దేవుడు మన నుండి సంపూర్ణ విధేయతను, సమర్పణను మాత్రమే కోరుతున్నాడు. గనుక పైకి కనిపించే భక్తితో ఇతరులను ఆకట్టుకోవాలని ప్రయత్నించవద్దు.

# గొప్ప న్యాయం

## ఓబద్యా గ్రంథం - సంగ్రహ సమీక్ష

### I. ఉపోద్ఘాతం :

పాతనిబంధన గ్రంథాలన్నిటిలోను, ప్రవచన గ్రంథాలన్నిటిలోను అతి చిన్న పుస్తకం, అనగా ఒకే ఆధ్యాయం గల పుస్తకం ఓబద్యా. పలుజాతులు చేసిన పాపమును గూర్చి వాటిపై రానున్న తీర్పును గూర్చి ప్రవక్తలందరూ ప్రవచించినప్పటికినీ, ఈ ప్రవక్త "ఎదోము"ను గూర్చి విశేషముగా ప్రవచించడం ఓ విశేషం.

1. **గ్రంథకర్త :** గ్రంథము యొక్క రచయిత ఓబద్యా అని మాత్రమే వ్రాయబడింది (1:1) ఇంతకు మించి ఇతని వివరాలేమి తెలియవు. యూదుల సంప్రదాయం ప్రకారం ఓబద్యా క్రీ.పూ. 9వ శతాబ్దమునకు చెందిన వాడని, ఆహాబు సమకాలికుడని, ఇతని ప్రవచనాలు యూదులపై అరబ్బీయులు మరియు ఎదోమీయులు చేసిన దాడులను ఉద్దేశించినవని పండితుల అభిప్రాయం (II ది.వృ. 28:17). ఈ గ్రంథంలో వ్రాయబడిన (1:11-4) విపత్తు క్రీ.పూ. 587 సం॥ యెరూషలేముపై బబులోనీయులు చేసిన దాడిని బట్టి జరిగిందని, వారితో ఎదోమీయులు చేతులు కలిపారని (కీర్త 137:7) మరి కొంతమంది అభిప్రాయం. దీనిని బట్టి ఓబద్యా చెరకాలానికి సంబంధించిన వ్యక్తి అనే అభిప్రాయం కూడ ఉన్నది. ఓబద్యా అన్న పేరుకు అర్థం, "యెహోవా సేవకుడు".

2. **గ్రంథ విశిష్టత :** ఓబద్యా 1:19లో చెప్పబడిన స్థలాలు నెహెమ్యా కాలంలో స్వతంత్రించుకోబడ్డాయి (నెహె 11:25-36). కనుక ఈ గ్రంథము మలాకీ కాలంలో, అనగా క్రీ.పూ. 5వ శతాబ్దంలో వ్రాయబడి ఉండవచ్చునని కొందరు, మరియు ఇతడు 9వ శతాబ్దానికి సంబంధించిన వాడు అని చెప్పేవారు క్రీ.పూ. 848 సం॥లో వ్రాయబడిందని చెప్తారు.

3. **గ్రంథ విశిష్టత :** ఓబద్యా పాత నిబంధనలో అన్నిటికన్నా చిన్న పుస్తకం అయినా, అందులోని శైలి, వర్ణనాత్మకమైన కావ్యభాషతో అలంకార యుక్తమైనది. ఈ గ్రంథము యిర్మీయా మరియు యోవేలు గ్రంథాలకు కొన్ని పోలికలున్నాయి. (ఓబ 1:1-9 ని యిర్మీ 49:7-22తో; 1:17 ను యోవే 2:32తో పోల్చి చూడండి). ఓబద్యా ప్రవచనాలు "యెహోవా వాక్కు"గా 4 సార్లు నిశ్చయంగా చెప్పబడింది (1:1,4,8,18).

4. **ముఖ్యాంశం :** ఈ గ్రంథం ఏకైక అంశం ఎదోము, యూదులకు చేసిన ద్రోహాన్ని బట్టి శిక్షించబడుతుంది. ఈ సందర్భంగా ప్రవక్త దేవుని పరిశుద్ధతను, ఆయన రాజ్యపు విశ్వవ్యాప్తతను మరియు లోక జాతులపై దేవుని నైతిక తీర్పులను వివరించాడు.

## II. గ్రంథ విభజన - సంక్షిప్త వివరణ :

**ఎ. ఎదోము పై తీర్పు :** ఎదోమీయులు ఇస్సాకు జ్యేష్ఠ కుమారుడైన ఏశావు వంశస్తులు (ఆది 25:30; 36:1). ఏశావు, యాకోబులు సహోదరులే అయినా ఏదోమీయులు యూదుల పట్ల అపనమ్మకస్తులుగా ఉన్నారు.

### 1. ఎదోమీయుల పాపం (1:1-9) :

**అ. గర్వము (1:3) :** ఎదోమీయులు ఎత్తైన పర్వత శిఖరాలపై నివసించేవారు. వారి రాజధాని అయిన పెట్రా అనే స్థలం చుట్టూ కొండ పేటులు కోటగోడల్లా ఉన్నాయి. శత్రువులెవరూ తమను ముట్టడి వేయలేరన్న ధీమాతో గర్వించి, సర్వశక్తుడైన దేవుణ్ణి మరచిపోయారు. అయితే దేవుడు వారిని అక్కడి నుండి క్రిందికి పడవేస్తాడు (1:4; యిర్మీ 49:15,16). దేవుడు గర్విష్ఠులను అణచి, (కీర్త 18:27; యెష 2:11-18) దీనులకే తన కృపనిస్తాడు (యాకో 4:6-10; I పేతు 5:5,6).

**ఆ. ఇతరులతో సంధించేసికొనుట (1:7) :** ముఖ్యంగా యూదులను నాశనం చేయగోరిన వారితో ఎదోమీయులు సహకరించారు. ఆనాటి నుండి నేటి వరకు ఇదే పద్ధతి కొనసాగుతున్నది. ఒక వ్యక్తిని నాశనం చేయడానికి శత్రువులుగా వున్నవారు మిత్రులవుతారు (లూకా 23:12). అయితే వారితో సమాధానంగా ఉన్నవారే వారికి ఉరి ఒడ్డుతారు (1:7). దేవుని యందు నమ్మికయుంచక ఇతరులను ఆధారం చేసికొనే వారందరికీ ఈలాగే సంభవిస్తుంది. మిత్రులే శత్రువులౌతారు.

**ఇ. జ్ఞానమును బట్టి అతిశయించుట (1:8) :** ఎదోము జ్ఞానులకు ప్రసిద్ధిచెందినది. యోబు స్నేహితుడైన ఎలీఫజు తేమానీయుడు. తేమాను ఎదోములోనే ఉన్నది (యోబు 2:11). అయితే వారి జ్ఞానం వారిని గాని, వారి దేశాన్ని గాని నాశనం నుండి తప్పించలేదు (యిర్మీ 49:7).

### 2. యూదా వారి పట్ల చేసిన ద్రోహము (1:10-14) :

**అ. పరదేశులు యూదావారిని దోచుకొన్నప్పుడు, ఎదోము వారితో చేతులు కలపింది (1:11):** **II** ది.వృ. 21:8, 16; ఆమో 1:6; **II** ది.వృ. 25:11;12,14,20,23,24; 28:16-21; 36:11-21 మరియు కీర్త 137:7 చదవండి.

**ఆ. వారి నాశనాన్ని చూసి ఆనందించారు (1:12) :** యూదావారి శ్రమలో బాధలో సహాయం చేయడానికి బదులు సంతోషించారు.

**ఇ. వారి ఆస్తులను దోచుకున్నారు (1:13)**

ఈ. వారిలో తప్పించుకొన్న వారిని సంహరించడానికి అడ్డ త్రోవలలో నిలిచారు. ఎదోమీయుల చేతిలో నుండి తప్పించుకొన్న వారిని శత్రువుల చేతికి అప్పగించారు (1:14).

3. **ఎదోమీయులకు కలుగబోయే శిక్ష (1:15,16) :** అన్యజనులందరి మీదికి రాబోయే యెహోవా దినమున, ఎదోమియులు యూదావారికి చేసినట్లే వారికి చేయబడుతుంది. విత్తినదానినే కోయడమన్న నియమం బైబిలంతటిలో కనిపిస్తుంది (కీర్త 7:15; గల 6:7). బబులోను చేసిన దానిని బట్టి దానికి కూడ ఆ విధంగానే చేయబడింది (యిర్మీ 50:29). ఏదోము చేసినట్లే ఎదోముకు చేయబడింది.

అ. యూదావారి మీద పగబట్టి వారిని ఖడ్గానికి అప్పగించినట్లు ఎదోమీయులు ఖడ్గానికి అప్పగించబడతారు (యెహె 35:5-11, 25:12-14).

ఆ. యూదా వారిని దోచుకొన్నట్లే ఎదోము దోచుకోబడుతుంది (ఓబ 1:5; యిర్మీ 49:9).

ఇ. యూదా ఓటమిని బట్టి త్రాగి సంతోషించినందుకు, దేవుని ఉగ్రత పాత్రలోని దేవుని కోపమనే మద్యాన్ని త్రాగాలి (ఓబ 1:16; యెహో 35:15; యిర్మీ 25:15-28; 49:12).

ఈ. యూదావారిని బాధించిన ఎదోమియులు యూదావారిచే దహించబడతారు (ఓబ 1:18; జెక 12:6).

ఉ. ఇశ్రాయేలు మరియు యూదాను స్వాధీన పరచుకోవాలనుకొన్న ఎదోమును (యెహె 35:10) ఇశ్రాయేలీయులు స్వాధీనం చేసికొంటారు (1:19).

4. **ఓబద్యా ప్రవచన నెరవేర్పు :** ఎదోము విషయంలో ఓబద్యా చెప్పిన ప్రవచనాలు కొన్ని నెరవేరాయి. ఇంకా నెరవేర్చబడాల్సినవి ఉన్నాయి.

అ. క్రీ.పూ. 312 సం॥లో ఎదోము రాజధానియైన పెట్రాలో ఉన్న వారిని, అరబీయులు తోలివేసారు.

ఆ. అటు పిమ్మట, దక్షిణ పాలస్తీనకు పారిపోయిన ఎదోమీయులను మక్కబీయుల కాలంలో (క్రీ.పూ. 134-104) యూదా సైన్యాధికారియైన జాన్ హెర్కేనస్ అణచివేసాడు.

ఇ. రోమీయులపై తిరుగుబాటు చేసిన ఎదోమీయులు, యూదులతో పాటు క్రీ.శ. 70 సం॥లో నాశనం చేయబడ్డారు.

ఎదోము నాశనాన్ని గూర్చి యెష 34:5-15; యెహె 25:12-14; 35:1-15; మరియు ఆమోసు 1:11, 12లో కూడ చూడవచ్చును. ఎదోము జాతి పాపము చేసి శిక్షకు గురైనా, కృపగల దేవుడు ఒక దినాన దానిని పునరుద్ధరిస్తాడు (యెష 11:14).

బి. యాకోబు కుటుంబం పునరుద్ధరించబడుట (1:17-21) :

1. యూదా వారికి భయంకరమైన హింసలు కలిగినా, దేవుని శిక్షకులోనైనా, దేవుని కృపకు అందరు అర్హులైనా కాకున్నా, యూదా పాలస్తీనలో సంపూర్ణంగా స్థిరపడుతుంది.
2. ఎదోము దేశముతో పాటు, ఇదివరకు స్వాధీనం చేసికోని స్థలాలను తమ ఆధీనంలో ఉంచుకొంటారు (ఆది 13:14, 15; యోవే 2:32; ఆమో 9:11-15; రోమా 11:26, 27).
3. వేయ్యేండ్ల పాలనలో యూదాలోని న్యాయాధిపతులు ఎదోమును ఏలుతారు.

ప్రియ పాఠకులారా! ఓబద్యా చిన్న పుస్తకమే అయినా గొప్ప ఆత్మీయ పాఠాన్ని నేర్పిస్తున్నది. విశ్వాసులుగా సహ విశ్వాసుల పట్ల మన వైఖరి ఎలా ఉన్నదో పరీక్షించుకొందాం. సహోదరులకు వ్యతిరేకంగా ఉండడం, వారి బాధలను చూసి సంతోషించడం, వారిని నాశనం చేయడానికి ఇతరులతో చేతులు కలపడం మన నాశనానికే కారణమౌతుంది (సామె. 24:17, 18). ఎదోము వలె దేవుని గొప్ప న్యాయ తీర్పుకు పాత్రులు కాకుండ జాగ్రత్తపడుదాం (మత్త 5:22; / యోహా 3:15-18; 4:20). అట్టి కృప ప్రభువు దయచేయును గాక!

---

## ప్రేమధార పాఠకులకు ఒక విజ్ఞప్తి

భారత దేశములో గత 30 సంవత్సరములుగా రేడియో ద్వారా సువార్తను ప్రకటిస్తున్న ట్రాన్స్ వరల్డ్ రేడియో - ఇండియా (టి.డబ్ల్యు.ఆర్-ఇండియా) దర్శనం ప్రకారం రేడియో ద్వారా సువార్త ప్రకటించి, రక్షించబడిన వారిని సంఘాలలో బలపర్చాలని, సామాజిక వికాస పథకాల ద్వారా సమాజాన్ని రూపాంతరపర్చాలని ఆశిస్తున్నాం. అందుకు మీ ప్రార్థన, ఆర్థిక సహకారాలు ఎంతైన అవసరం. ఈ రేడియో కార్యక్రమాలను మీ బంధువులకు, స్నేహితులకు, ఇరుగు పొరుగు వారికి పరిచయం చేయండి. ఇక నుండి రేడియో పరిచర్య నిమిత్తం మీరు పంపించే విరాళాలు (చెక్కు/డిమాండ్ డ్రాఫ్ట్/మనియార్డర్) "ట్రాన్స్ వరల్డ్ రేడియో-ఇండియా" (Trans World Radio-India) పేరు మీద తీసి మా చిరునామాకు పంపించవలసినదిగా మనవి చేస్తున్నాము. ప్రభువు మీకిచ్చిన ధనాన్ని విలువైన దాని కొరకు పెట్టుబడిగా పెట్టి నిత్యత్వంలో అధిక లాభాన్ని పొందాలని ఆశిస్తున్నాం. ప్రభువు మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సమృద్ధిగా దీవించునుగాక! ఆమేన్!!

---

## TTB - Telugu - Study Outlines Book of HOSEA, JOEL, AMOS & OBADIAH

Printed by : **PREMADHARA, TRANS WORLD RADIO - INDIA**
12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE MP3 DOWN LOAD**
Log on to : **www.radio882.com**